



టమోటాపై మచ్చలు

వాన దెబ్బ..!

టమోటాను చుట్టుముట్టిన తెగుళ్లు

మందులు పిచికారీ చేసినా ప్రయోజనం శూన్యం

ఆందోళనలో రైతులు



మచ్చ, ఆకుముడత బారిన పడిన టమోటా పంట

ధరలు నిలకడగా ఉన్నాయనుకుంటున్న తరుణంలో టమోటా రైతుకు వాతావరణం రూపంలో కొత్త కష్టం వచ్చిపడింది. వర్షాలు కురుస్తుండడం, ఎండ లేకపోవడం తదితర కారణాలతో పంటకు తెగుళ్లు విపరీతంగా సోకుతున్నాయి. మందులు పిచికారీ చేస్తున్నా.. వర్షం కురుస్తూనే ఉండడంతో తెగుళ్లు అదుపులోకి రావట్లేదని వాపోతున్నారు. దీంతో అదనంగా ఖర్చు పెరుగుతోంది తప్ప.. ప్రయోజనం లేదని వాపోతున్నారు. వాతావరణ పరిస్థితులు మారకపోతే పంటను తొలగించుకోవాల్సిందేనని ఆందోళన చెందుతున్నారు.

తనకల్లు, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): మండలంలో సీజన్‌తో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ టమోటా పంట వేలాది ఎకరాల్లో సాగులో ఉంటుంది. ఈ యేడాది ప్రారంభం నుంచి నష్టాలు చవిచూసిన టమోటా రైతులు.. రెండు నెలలుగా లాభాల బాట పట్టారు. దీంతో మండలవ్యాప్తంగా ఐదువేలకుపైగా ఎకరాల్లో పంట సాగుచేశారు. ధరల్లో కొంత హెచ్చుతగ్గులున్నా.. రైతులు పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. పది రోజులుగా వాతావరణంలో మార్పుల వల్ల గాలిలో తేమ శాతం పెరగడం, ఉష్ణోగ్రతలు తగ్గడం, వర్షాలు అధికంగా కురవడంతో టమోటా పంట దెబ్బతింటోంది. పంటకు ఆకుముడత, కాయలకు మచ్చ, గజ్జి వ్యాపించింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధరలు నిలకడగా ఉండడంతో ఎంతో కొంత చేతికొస్తుందనుకుంటే, కాయలు మొత్తం గజ్జి, మచ్చలు రావడంతో మార్కెట్‌లో అడిగేవారే కరువయ్యారని వాపోతున్నారు. దీంతో గజ్జి, మచ్చలు వచ్చిన కాయలను అడిగినకాడికి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ లేకపోవడంతో పంటకు మందులు పిచికారీ చేస్తున్నా ప్రయోజనం దక్కట్లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గాలిలో తేమశాతం అధికంగా ఉండడం, ఉన్నట్లుండి వర్షం పడుతుండడంతో మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేదంటున్నారు. ఎకరంలో ఒకసారి మందు పిచికారీ చేయడానికి రూ.6 వేల నుంచి 10వేలదాకా ఖర్చు చేస్తున్నారు. మండలవ్యాప్తంగా ప్రస్తుతం కాయదశలో ఉన్న ఐదువేల ఎకరాల టమోటాకు మందులు ఒకసారి స్ప్రే చేయడానికి రూ.50 లక్షలదాకా వెచ్చిస్తున్నారు. ప్రభుత్వం పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.



మచ్చ కాయలను వేరు చేస్తున్న రైతులు

వాతావరణం మారకపోతే టమోటాను తొలగించాల్సిందే



ప్రస్తుతం వాతావరణంలో మార్పుల వల్ల టమోటా పంటకు మచ్చ, గజ్జి, ఆకుముడత తెగుళ్ల విపరీతంగా వ్యాపించాయి. వేల రూపాయలు ఖర్చు చేసి, మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేదు. పరిస్థితుల్లో మార్పు రాకపోతే పంటను తొలగించుకోవాల్సిందే. ప్రస్తుత వాతావరణానికి పూత కూడా నిలవడంలేదు. అధికారులు గ్రామాల్లో పర్యటించి తెగుళ్ల నివారణ చర్యలపై అవగాహన కల్పించాలి.

\- సుధాకర్‌రెడ్డి, రైతు, కొత్తకురవపల్లి

వర్షంతో నిండా మునిగినట్లే



ప్రస్తుతం వర్షాలు అధికంగా కురుస్తుండడంతో టమోటా పంటకు తెగుళ్లు విపరీతంగా ఏర్పడుతున్నాయి. మార్కెట్‌కు తరలిస్తే కాయలు అమ్ముడుపోవు. కాయలను వేరు చేసి, మార్కెట్‌కు తరలిస్తే ప్రస్తుతం 50 శాతం ఉన్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే గజ్జి, మచ్చకాయలు 75 శాతానికి పెరుగుతాయి. వాతావరణంలో మార్పులు రాకపోతే వర్షాలతో టమోటా రైతులు నట్టేట మునిగినట్లే.

-మహదేవరెడ్డి, రైతు, మార్పురివాండ్లపల్లి

అలరించిన స్వరమాధురి



పాటలు పాడుతున్న ఏలూరు భక్తులు

పుట్టపర్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా భక్తులు చేపట్టిన శ్రీసత్యసాయి స్వరమాధురి గాన కచేరీ భక్తులను అలరించింది. పర్తి యాత్ర పేరిట ఆ జిల్లా భక్తులు శనివారం ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంతు సభామండపంలో సంగీత గాన కచేరి నిర్వహించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



సత్యసాయి సన్నిధికి ప్రదర్శనగా వస్తున్న భక్తులు

కమీషన్ల కోసమే హంగామా

వైసీపీ నాయకులపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మండిపాటు

పెనుకొండ టౌన్/మడకశిర టౌన్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ల వద్ద కమీషన్ల కోసం వైసీపీ చేసిన హంగామానే 17 వైద్య కళాశాలల నిర్మాణమని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆరోపించారు. పెనుకొండలో ఆగిపోయిన వైద్య కళాశాలను ఆయన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా వైసీపీ నాయకులు చలో మెడికల్ కళాశాల అంటూ పిలుపునిచ్చి శుక్రవారం ఇక్కడ హంగామా చేయడం దారుణమన్నారు. అధికారంలో ఉన్న సమయంలో కళాశాల నిర్మాణం ప్రారంభించి మూడేళ్లు గడిచినా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పీపీపీ విధానం ద్వారా కళాశాలలు పూర్తి చేయాలన్న ఆలోచనలో ప్రస్తుత ప్రభుత్వం ఉంటే దానిపై వైసీపీ యాగీ చేస్తోందని మండిపడ్డారు. రూ.470కోట్లతో నిర్మించాల్సిన కళాశాలకు రూ.35కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి ఏం ఉద్ధరించారని నేడు హంగామా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కళాశాలకు ఖర్చు పెట్టిన నిధులు, చేసిన, చేయాల్సిన పనులపై హంగామా చేసిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు తనతో చర్చకు రావాలని సవాల్ విసిరారు. అనంతరం ఆయన మడకశిరలో విలేకరులతో మాటాడుతూ కేంద్రం ఇచ్చిన నిధులు తప్ప రాష్ట్ర వాటాగా ఒక్క పైసా ఖర్చు చేయని అసమర్థుడు జగన్ అని మండిపడ్డారు. వైసీపీ నేతలు ఎన్ని అబద్ధాలు చెప్పిన ప్రజలు నమ్మరన్నారు. గోరంత చేసి కొండంత ప్రచారం చేసుకోవడం జగన్‌కు అలవాటేనని ఎద్దేవా చేశారు. ఆయన వెంట సుబ్రహ్మణ్యం, నంజుండ, రంగనాయకులు పాల్గొన్నారు.



ఆగిపోయిన వైద్య కళాశాలను చూపుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

ఊరూరా పచ్చదనం పెంపొందించాలి

● కలెక్టర్ శ్యాంప్రసాద్



మొక్క నాటి, నీరు పోస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

ధర్మవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, వాటిని బాధ్యతగా సంరక్షించాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నెలలో మూడో శనివారం ప్రతి గ్రామం, మున్సిపాలిటీలో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం, ఇందిరానగర్‌లో శుక్రవారం కలెక్టర్ మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది థీమ్ గ్రీన్ ఆంధ్రప్రదేశ్ అన్నారు. అందులో భాగంగా జిల్లాను హరిత జిల్లాగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రాబోవు ఏడాదిలో కోటి మొక్కలు నాటేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటిని పరిరక్షించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్, ఇన్‌చార్జి కమిషనర్ సాయికృష్ణ, డీఈ వీరేశ్, అటవీశాఖ అధికారులు మల్లికార్జున, అక్కులప్ప, పుల్లప్ప, గిరీశ్, వీఆర్‌ఏ రవిశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, చీమల రామాంజి, బొట్టుకిష్ట, సీబీఎన్ రామకృష్ణ పాల్గొన్నారు.

22న విడుదల..!

అందరి దృష్టి ఆ తేదీపైనే..!

- జీఎస్టీ ఎఫెక్ట్..
- తగ్గిన వాహనాల కొనుగోలు
- షో రూంల నుంచి కదలని కార్లు, బైక్‌లు
- 22 పైనే కంపెనీల ఆశలు



అనంతపురంలోని మహీంద్రా షోరూం, శివ్‌సాయి హోండా షోరూం



అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏటా దసరా పండుగ సందర్భంగా వాహనాల కొనుగోళ్లతో షోరూమ్‌లు బిజీగా ఉండేవి. నిర్వాహకులు సైతం కొత్త కొత్త ఆఫర్లు ప్రకటించేవారు. దీంతో వినియోగదారులతో కిటకిటలాడుతూ కనిపించేవి. ఇప్పుడు సీజన్ ఉన్నా అవే షోరూంలలో సందడి లేదు. మేనేజర్లు, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు ఆఫర్ల మీద దృష్టి పెడుతుంటే... అమ్మకాల కోసం సేల్స్‌మెన్ తంటాలు పడుతున్నారు. ఈనెల 22వ తేదీ నుంచి వస్తు సేవల పన్ను(జీఎస్టీ) తగ్గింపుతో ధరలు తగ్గనున్నాయి. ఇది వరకు ఉన్న 5, 12, 18, 28 శాతంగా ఉన్న పన్ను రేట్లలో ఇకపై 5, 18 పన్ను రేట్లు మాత్రమే కొనసాగనున్నాయి. ఈ మేరకు ఈనెల 3వతేదీ జీఎస్టీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పాలు, పనీర్, బిస్కెట్లు, సబ్బులు, షాంపూల నుంచి ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, ద్విచక్రవాహనాలు, చిన్న కార్ల వరకు ధరలు దిగిరానున్నాయి. వైద్యపరికరాలపై జీఎస్టీని 12 నుంచి 5శాతానికి తగ్గించారు. నోట్‌బుక్స్, పెన్సిళ్లు, క్రెయాన్లు, మ్యాప్‌లు, చార్టులపై జీఎస్టీ రద్దు చేయడంతో విద్యార్థులపై భారం తగ్గినట్లయింది. హానికర, విలాస వస్తువులపై మాత్రం 40శాతం ప్రత్యేక పన్ను విధిస్తారు. పాన్ మసాలాలు, గుట్కా, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులపై ప్రస్తుతమున్న ధరలే కొనసాగేలా పన్నులుంటాయి. కాగా నిత్యం వాడే ఫోన్లలో మాత్రం మార్పు లేకపోవడం గమనార్హం.

కార్లు, బైక్‌లపైనే దృష్టి

జీఎస్టీ తగ్గింపుతో అందరి దృష్టి కార్లు, బైక్‌లపై పడింది. ఆటోమొబైల్ రంగంపై జీఎస్టీని 28 నుంచి 18 శాతానికి తగ్గించారు. పెట్రోల్, పెట్రోల్-హైబ్రిడ్, ఎల్‌పీజీ, సీఎన్‌జీ కార్లు (1200 సీసీ, 4000ఎంఎం లోపు), డీజిల్, డీజిల్-హైబ్రిడ్ కార్లు (1500సీసీ, 4000ఎంఎంలోపు మాత్రమే), త్రిచక్ర వాహనాలు (ఆటోలు తదితర), 350 సీసీలోపు ఉండే మోటారు సైకిళ్ల, రవాణా వాహనాలకు ఇది వర్తిస్తుంది. బైక్‌లపై రూ.7వేల నుంచి రూ.13వేల వరకు ధరలు తగ్గనున్నాయి. కార్లపై రూ.50వేల నుంచి రూ.1.70 లక్షల వరకు ధరలు (మిగతా 7లో...)

ఇంక పండగే..!

దసరా సెలవుల ప్రకటనతో సొంతూళ్లకు విద్యార్థులు



అనంతపురం బస్టాండులో వేచి ఉన్న ప్రయాణికులు (6లో...)

నిధులు తవ్వుకుని..

ఫాంపాండ్లను పూడుస్తున్న కొందరు

ప్రభుత్వ ఆశయానికి తూట్లు.. పట్టించుకోని అధికారులు



ప్లాస్టిక్ రహిత నగరంగా అనంత

స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



డివైడర్లపై మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారం, భాగస్వామ్యంతో అనంతపురాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. అనంత నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సూర్యానగర్ రోడ్డులో శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని రవికుమార్, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్, అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో కలిసి ఎమ్మెల్యే డివైడర్ల మధ్యలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నగరంలో 500 మొక్కల నాటారు. అంతకుముందు నగరంలో పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని అధికారులు, నాయకులు, ప్రజలతో ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతినెల మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మహిళలు, ప్రజలు మురుగు కాలవలు, రోడ్లపై చెత్త వేయకుండా ఇంటి వద్దకు వచ్చిన మున్సిపల్ కార్మికులకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఏడాది కాలంలోనే నగరంలో 95శాతం ప్లాస్టిక్‌ను నివారించామని, గత ఆరు నెలలుగా ఏఎంసీ, విజిలెన్స్ అధికారులు నిత్యం దాడులు చేస్తున్నారని తెలిపారు. ప్రజల సహకారంతో దేశంలోనే అనంతను రోల్‌మోడల్‌గా మారుస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఎస్ఈ రాజశేఖర్, టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, కోనంకి గంగారామ్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు రంగాచారి, పోతుల లక్ష్మీనరసింహులు, పీఎల్ఎన్ మూర్తి, కొండన్న, బొమ్మినేని శివ, కార్పొరేటర్లు బాలాంజినేయులు, బాబా, నాయకులు సింగవరం రవి, రాజారావు, అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ కృష్ణకుమార్, సంగా తేజశ్విని, సాకే లక్ష్మీనరసింహ, సుధాకర్ యాదవ్, ఫిరోజ్ అహ్మద్, ఏఎంసీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సుందరీకరణ వేగవంతం చేయండి

● ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



గంగపూజ చేస్తున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో చిత్రావతి నదీ తీర సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్‌కు ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి సూచించారు. కర్ణాటక ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు చిత్రావతి నది పొంగి ప్రవహిస్తోంది. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి నదిని ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాలనాటికి అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. చిత్రావతి నదీ పరివాహకంలోని ముంపు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎనుమలపల్లి చెరువు మరువ వద్ద గంగపూజ నిర్వహించారు.



అనంత బస్టాండు: ఎప్పుడొస్తుందబ్బా.. మనూరి బస్సు

ఇంక పండగే..!

దసరా సెలవుల ప్రకటనతో సొంతూళ్లకు విద్యార్థులు



పిల్లోళ్లు ఎబ్బుడు వస్తారో..?
(బడి బయట తల్లిదండ్రుల నిరీక్షణ)



బైబై.. రేపటి నుంచి బడికి సెలవు



బిరబిర పోవళ్ల.. లేకుంటే బస్సు మిస్ అయితాది.



ఇదిగో.. ఈ బ్యాగు ఆ సీట్లో వెయ్యన్నా..

అనంతపురం విద్య, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పండుగకు ముందే విద్యాలయాలు, బస్టాండ్ల వద్ద దసరా సందడి నెలకొంది. విద్యాలయాలకు ఈనెల 22నుంచి దసరా సెలవులు ప్రకటించడంతో నగరంలో ఉండి చదువుకుంటున్న వివిధ ప్రాంతాల విద్యార్థులు శనివారం నుంచే ఇంటిబాట పట్టారు. ఈ క్రమంలో సాయంత్రం విద్యాలయాలు, హాస్టళ్ల వద్ద స్నేహితులకు బైబై అంటూ వీడ్కోలు పలికి, హడావుడిగా బ్యాగులు సర్దుకుని తమ కోసం వచ్చిన వారితో కలిసి ఆనందంగా బస్టాండుకు బయల్దేరారు. పిల్లలను తీసుకెళ్లడానికి వచ్చిన తల్లిదండ్రులతో నగరంలోని పలు ప్రాంతాలు సందడిగా మారాయి. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ జాం అయ్యింది. ఆర్టీసీ బస్టాండ్ పిల్లలు, వారి తల్లిదండ్రులతో కిటకిటలాడింది. బస్సులలో సీట్లకోసం చాలామంది ఫీట్లు చేస్తూ కనిపించారు.



రేయ్.. పొయ్యొస్తాం రా



లే.. లే.. జాగ్రత్తరా ..! జారేవు..

డీఐజీ, జిల్లా న్యాయాధికారిని

కలిసిన ఎస్పీ

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిముషిని, జిల్లా న్యాయాధికారి భీమారావును నూతన ఎస్పీ సతీష్ కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలను అందజేశారు.





డీఐజీ షిముషికి, జిల్లా న్యాయాధికారి భీమారావుకు పుష్పగుచ్ఛాన్ని ఇస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

పోటీలతో నైపుణ్యం మెరుగు

● జిల్లా విద్యాధికారి కిష్టప్ప



ప్రతిభ చాటిన విద్యార్థులతో జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్

కొత్తచెరువు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యాసరచన, వక్తృత్వపు పోటీల్లో పాల్గొనడం ద్వారా నైపుణ్యాలు మెరుగుపరచుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప సూచించారు. జిల్లాలోని 12 పాఠశాలల నుంచి 22 మంది విద్యార్థుల బృందాలకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలను శనివారం ఆయా పాఠశాలల్లో నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో అగళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు హర్షియాబాను, దీక్షిత, సంజన మొదటి స్థానంలో నిలిచారని జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్ తెలిపారు. ముదిరెడ్డిపల్లి, సోమందేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. వ్యాసరచన పోటీల్లో కోరేవాండ్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వనజ, బిందుశ్రీ, హర్షిత్‌కుమార్ విజేతలుగా అవతరించారు. నిడిమామిడి జిల్లా పరిషత్, ధర్మవరంలోని శాంతినగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేత బృందాలు అగళి, కోరేవాండ్లపల్లికి చెందిన విద్యార్థులు అక్టోబరు 16 నుంచి నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఆ విద్యార్థులను డీఈఓ, సైన్స్ అధికారి, గైడ్ టీచర్‌లు షబ్బీర్, భాస్కర్, మస్తాన్ అభినందించారు.

సూక్ష్మ సేద్యానికి చేయూత

● జీఎస్టీ 5 శాతానికి తగ్గింపు



డ్రిప్ ఇరిగేషన్ యూనిట్

కొత్తచెరువు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం జీఎస్టీని తగ్గించిందని ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ శనివారం తెలిపారు. సూక్ష్మసేద్యం పరికరాలపై ఇదివరకు జీఎస్టీ 12.5 శాతం వసూలు చేసేవారు. ఇది రైతులకు భారంగా ఉండేది. క్షేత్రస్థాయిలో కూడా డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలకు సబ్సిడీ చెల్లించేందుకు ఇబ్బందులు పడేవారు. దీంతో డ్రిప్, స్ప్రింక్లర్ల పంటలసాగు తగ్గుముఖం పడుతుండటంతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని 5 శాతానికి తగ్గించిందని ఆయన తెలిపారు.

భారం తగ్గిందిలా..

గతంలో హెక్టారుకు రాయితీ బిందుం సేద్యపరికరాలకు జీఎస్టీ 12.5 శాతం రైతులు చెల్లించాల్సి ఉండేది. దీంతో రైతు జీఎస్టీతో కలిపి హెక్టారుకు రూ.24వేల నుంచి రూ.28వేలు చెల్లించేవారు. కేంద్రప్రభుత్వం జీఎస్టీని 5 శాతానికి తగ్గించింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 2.5 శాతం జీఎస్టీని చెల్లించగా.. మిగిలిన 2.5 శాతం రైతు కట్టుకోవాలి. ఈ లెక్కన రైతు హెక్టారుకు జీఎస్టీ కింద రూ.12వేలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. దీంతో రైతులపై జీఎస్టీ భారం తగ్గింది.

రక్త నమూనాలను ప్రభుత్వ ఆస్పత్రికి పంపాలి

ప్రైవేటు ఆస్పత్రులకు డీఎంహెచ్ఓ సూచన

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): డెంగీ నిర్ధారణ కోసం సేకరించిన రక్త నమూనాలను ప్రభుత్వ ఆసుపత్రి మైక్రో బయాలజీ ల్యాబ్‌కు పంపాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు సూచించారు. జిల్లా మలేరియా అధికారి ఓబులు అధ్యక్షతన మలేరియా సబ్ యూనిట్ అధికారుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. జ్వరంతో వచ్చే రోగుల నుంచి సీరం శాంపిల్స్‌ను సేకరించి, డెంగీ నిర్ధారణ కోసం ఎలిసా పద్ధతిలో పరీక్షలు చేయాలని డీఎంహెచ్ఓ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎలిసా పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అన్ని ల్యాబ్‌ల టెక్నీషియన్స్‌తో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి, సబ్ యూనిట్ అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏఓ గిరిజ మనోహర్‌రావు, డాక్టర్లు యుగంధర్, విష్ణుమూర్తి, నరేంద్రరెడ్డి, ఎస్ఓ మహ్మద్ రఫీ, హెచ్ఈఈఓ నాగరాజు, డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధన అధికారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

● నమో యువ రన్‌లో బీజేపీ నేతలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బంగారు భవితను సర్వనాశనం చేస్తున్న మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవాపక్షోత్సవాల్లో భాగంగా శనివారం బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో నమో యువరన్ నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి సప్తగిరి సర్కిల్ ప్రదర్శన నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్, మద్యపానానికి దూరంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి యువతకు సూచించారు. వైసీపీ హయాంలో దేశంలో ఎక్కడ మాదకద్రవ్యాలు పట్టుబడినా మూలాలు ఏపీలో ఉండేవని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి, కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, నాయకులు చిరంజీవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీకి హాజరైన బీజేపీ నాయకులు, యువత

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం: కలెక్టర్ ఆనంద్



మహిళలకు మొక్కలు అందజేస్తున్న కలెక్టర్

గార్లదిన్నె, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు పాటుపడాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టర్ ఆనంద్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహర్ గార్లదిన్నెలో పర్యటించారు. జంబులదిన్నె గ్రామ సమీపంలో రైతు గిర్రెడ్డి సాగుచేసిన మామిడి తోటను, నీటి కుంటను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. మండలవ్యాప్తంగా పండ్లతోటలు సాగు చేస్తున్నామనీ, తెగుళ్లకు మందులు పిచికారీ చేసేందుకు రాయితీతో డ్రోన్లు ఇవ్వాలని రైతులు కోరారు. అనంతపురం మార్కెట్‌లో చీనీ విక్రయాల్లో రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని రైతులు వాపోయారు. మార్కెట్ నిర్వాహకులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులకు నష్టం వచ్చేలా వ్యహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ... రైతు సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందని చర్చించారు. పండ్లతోటలను రైతులు విరివిగా సాగు చేయాలన్నారు. ఉద్యాన పంటలతోనే రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. బస్టాండ్ సర్కిల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ఏర్పాటు చేసిన మానవహారంలో పాల్గొని, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం శివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మహిళలకు మొక్కలు అందజేశారు. స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, ఆర్డీఓ కేశవనాయుడు, డ్వామా పీడీ సలీం బాషా, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, స్వచ్ఛ భారత్ కార్పొరేషన్ డైరెక్టర్ భవానీప్రసాద్, జడ్పీ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజనాయుడు, డీసీ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణా, గేటు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

స్మార్ట్ రైస్ కార్డులను ఇంటి వద్దకే వెళ్లి ఇవ్వండి: జేసీ

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రైస్ కార్డులను ఇళ్ల వద్దకే వెళ్లి కార్డుదారులకు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశించారు. చౌక ధరల దుకాణాల వద్ద పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులొస్తున్నాయని ఆయన తెలిపారు. సచివాలయ సిబ్బంది నేరుగా ఇళ్లకు వెళ్లి ఇవ్వాలని సూచించారు. జిల్లాలో 6,57,828 స్మార్ట్ రైస్ కార్డుదారులకు ఈ నెల 15 నుంచి పంపిణీ చేస్తున్నామని జేసీ తెలిపారు. ఇప్పటివరకు 3,34,214 మందికి పంపిణీ చేశామని అన్నారు. క్యూ ఆర్ కోడ్ కలిగిన ఈ స్మార్ట్ రైస్ కార్డులను చౌకధరల దుకాణాలకు మ్యాపింగ్ చేసి.. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దకే పంపుతామని తెలిపారు. పంపిణీ సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే, వాటిని పరిష్కరించి కార్డుదారుల ఇంటి వద్దే పంపిణీ చేయాలని సూచించారు. కార్డుదారులను ఒకచోటకు పిలిపించి ఇవ్వవద్దని హెచ్చరించారు. తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, సీఎస్‌డీటీలు సచివాలయ సిబ్బంది ద్వారా కార్డుదారుల బయోమెట్రిక్ తీసుకుని, ఇంటి వద్దనే పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



పుట్టపర్తి మండలం చెర్లోపల్లి వద్ద పాక్షికంగా పూడ్చేసిన ఫాంపాండ్

● లోపించిన పర్యవేక్షణ

ఫాంపాండ్లను పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ప్రతి ఫాంపాండ్ స్థలాన్ని జియోట్యాగ్‌చేసి సీజన్ తర్వాత జోన్ సర్వేతో నీటినిల్వ ఉందో లేదా చూడాలి. వర్షాకాలం తర్వాత నిజంగా ఫాంపాండ్‌లో నీరు నిల్వ ఉందని నిర్ధారించిన తర్వాతనే సబ్సిడీ చెల్లించాలి. నకిలీ బిల్లులు వేస్తే భూ అభివృద్ధి చట్టాల కింద కేసులు నమోదు చేయాలి. కాని భూమి దాహం తీర్చి రైతులకు మేలు చేయాలన్న లక్ష్యంతో రూపొందించిన పథకాన్ని సంబంధిత అధికారులు అపహాస్యం చేస్తున్నారనే విమర్శలు మూటగట్టుకుంటున్నారు.

నిధులు తవ్వుకుని..

ఫాంపాండ్లను పూడుస్తున్న కొందరు

ప్రభుత్వ ఆశయానికి తూట్లు

పట్టించుకోని అధికారులు



చెర్లోపల్లి సమీపంలో ఫాంపాండ్‌ను రాళ్లతో నింపిన దృశ్యం

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నిధుల కోసమో, లేక అవకాశం వచ్చింది కదా అని ఫాంపాండ్ తవ్వారు. బిల్లులు చేతికందగానే అవసరం తీరింది కదా అని వాటిని పూడ్చేస్తున్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంచడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫాంపాండ్ల తవ్వకాన్ని ప్రోత్సహించాయి. ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయనే ఆలోచనతో అప్పట్లో చాలా మంది రైతులు ఫాంపాండ్లను తవ్వించారు. ఇదే అదనుగా అప్పటి అధికారపార్టీ నాయకులు అధికారులతో కుమ్మక్కై ఎక్కడబడితే అక్కడ తవ్వకుని బిల్లులు చేసుకుతిన్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ఆ ఫాంపాండ్లతో పని లేదనుకున్నారో ఏమో కొందరు వాటిని పూడ్చే పనిలో నిమగ్నమయ్యారు. ఇదీ... ప్రభుత్వం ఎంతో సమున్నత లక్ష్యంతో ప్రారంభించిన ఫాంపాండ్ల కథ కమామిషు. మండలంలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో ప్రధాన రహదారి పక్కనే మూడేళ్ల కిందట ఫాం పాండ్లను తవ్వారు. అదీ వందమీటర్ల పరిధిలో ఒకే వ్యక్తికి చెందిన పొలంలో ఆయన కుటుంబసభ్యుల పేర్లతో మూడు ఫారంపాండ్లకు అనుమతులు తెచ్చుకుని, తవ్వించుకున్నాడు. పీఎంకేఎస్‌వై నిధులతో ఒక్కో ఫాంపాండ్ 50మీటర్లు పొడవు, 20మీటర్ల వెడల్పు 2మీటర్ల లోతుతో తవ్వారు. అప్పటి అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో అధికారులు కూడా ఒక్కో ఫాంపాండ్‌కు రూ.లక్ష బిల్లులు త్వరగానే మంజూరు చేసినట్లు తెలిసింది. ఇక ఇప్పుడు కాలం గడిచిందని ఆ వ్యక్తి ఫాంపాండ్లను పూడ్చేపనిలో నిమగ్నమయ్యారు.

షోకాజ్ నోటీస్ ఇస్తాం



భూగర్భ జలాలను పెంచి తద్వారా రైతుకు లాభం చేకూర్చాలన్న లక్ష్యంతో నిర్మించిన ఫాంపాండ్లను పూడ్చిన రైతులకు షోకాజ్ నోటీసులను జారీ చేస్తాం. ఫాంపాండ్ తవ్వకానికి మంజూరు చేసిన నిధులను రికవరీ చేస్తాం.

- విజయేంద్రప్రసాద్, డ్వామా పీడీ

క్రైం కార్నర్

అత్తింటివారిపై కేసులు

అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని..

కూడేరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో శనివారం ఒకే రోజు రెండు అదనపు కట్నం వేధింపుల కేసులు నమోదయ్యాయి. కమ్మూరు గ్రామానికి చెందిన శైలజను అదనపు కట్నం కోసం భర్త, అత్త మామలు వేధింస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. శైలజకు గార్లదిన్నె మండలం కనుంపల్లి గ్రామానికి చెందిన అనిల్ కుమార్‌తో ఆరు నెలల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో ఆరు తులాల బంగారం కట్నంగా ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదనపు కట్నం కావాలని నిత్యం వేధిస్తున్నారని శైలజ పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఆమె భర్త అనిల్ కుమార్, అత్త రమాదేవి, మామ జగన్నాథ్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఇదే తరహాలో చోళసముద్రం గ్రామానికి చెందిన వనిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె భర్త పురుషోత్తం, అత్త లక్ష్మీదేవి, మామ చిదంబరప్పపై పోలీసులు కేసు నమోదు చేశారు. వనితకు గార్లదిన్నె మండలం పెనకచెర్లకు చెంది పురుషోత్తంతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. పురుషోత్తం ఉద్యోగ రీత్యా ఢిల్లీలో ఉండటంతో అక్కడే కాపురం పెట్టారు. అదనపు కట్నం కావాలని తనను నిత్యం వేధిస్తున్నారని వనిత ఫిర్యాదు చేశారు.

ప్రాణం తీసిన టిప్పర్


శ్రీకాంత్ (ఫైల్)

రాప్తాడు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొందిరెడ్డిపల్లి వద్ద టిప్పర్ కింద పడి శ్రీకాంత్(28) అనే యువ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు, రామినేపల్లికి చెందిన శ్రీకాంత్ కనగానపల్లి వద్ద రెండు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని టమోటా సాగు చేశాడు. టమోటా పంటకు పురుగుల మందు పిచికారీ చేసి, బైక్‌పై తిరిగి వస్తుండగా గొందిరెడ్డిపల్లి వద్ద టిప్పర్ ఎదురుగా వచ్చింది. దీంతో బైక్‌ను శ్రీకాంత్ రోడ్డు పక్కకు తీసి ఆగాడు. టిప్పర్ ముందు భాగం వెళ్లిన తరువాత వెనుక భాగం బైక్ హ్యాండిల్‌కు తగులుకుంది. దీంతో శ్రీకాంత్ అదుపు తప్పి టిప్పర్ చక్రాల కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శ్రీకాంత్ కుటుంబ సభ్యులు ప్రమాద స్థలానికి చేరకుని బోరున విలపించారు. శ్రీకాంత్ మృతదేహాన్ని పోలీసులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాప్తాడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన తల్లీబిడ్డలు సేఫ్

- హైదరాబాద్‌లో గుర్తించి తీసుకువచ్చిన పోలీసులు



హైదరాబాదులో మాధవి, ఆమె పిల్లలతో గుత్తి పోలీసులు

గుత్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి ఇద్దరు పిల్లలతో వెళ్లిపోయిన మహిళను హైదరాబాదులో గుత్తి పోలీసులు గుర్తించి, తిరిగి తీసుకువచ్చారు. పట్టణంలోని గాంధీ నగర్‌కు చెందిన మాధవి తన పిల్లలు సిద్ధార్థ్, భానుశ్రీతో కలిసి జూలై 18న బాట సుంకులమ్మ ఆలయానికి వెళ్లారు. ఆ తరువాత ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు సుంకరత్నమ్మ, వెంకటరాముడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు, వారు హైదరాబాదులోని యూసఫ్ గూడలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడి పోలీసు స్టేషన్‌లో రికార్డు చేయించి గుత్తికి తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తన భర్త శ్రీనివాసులు కార్పెంటరు పనికి వెళ్లడం లేదని, దీంతో పిల్లల పోషణ భారం కావడంతో అతనితో విభేదించి ఇంటి నుంచి వెళ్లిపోయానని మాధవి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


కాయల ఆదెప్ప

శింగనమల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సి.బండమీదపల్లి గ్రామానికి చెందిన కాయల ఆదెప్ప అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. సి.బండమీదపల్లికి చెందిన ఆదెప్ప ఇంట్లో గొడవపడి రెండు రోజుల క్రితం వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు శింగనమల పోలీసు స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు అలవాటు పడిన ఓ వ్యక్తి డబ్బు కోసం బైక్ దొంగతనాలను ప్రారంభించాడు. వాటిని అమ్మగా వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసుకుంటున్నాడు. నిఘా వేసిన అనంతపురం వన్‌టౌన్ పోలీసులు, గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన రమణ(35) అనే వ్యక్తిని అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.2.30 లక్షల విలువ చేసే 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు శనివారం విలేకరులకు తెలియజేశారు.

గుత్తి చెరువులో డెవిల్ ఫిష్

గుత్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించే డెవిల్ ఫిష్ గుత్తి చెరువులో తారసపడింది. ఈ చేప మత్స్యకారుల వలకు శనివారం చిక్కింది. ఆర్మర్డ్ సెయిల్ ఫిన్ క్యాట్ ఫిష్‌గా పేర్కొనే ఈ చేప నీటి వనరులలో దురాక్రమణదారుగా పేరొందింది. తూర్పు కనుమలలోని 65 శాతం నీటివనరులలో ఈ చేప కనిపించడం ఆందోళన కలిగించే అంశం. ఈ చేప ఎక్కడున్నా మిగిలిన చేపలను వేటాడి తినేస్తుంది. వాటి మనుగడకు ముప్పు కలిగిస్తుంది. ఈ చేపను ఆహారంగా తీసుకోరని, వలలో చిక్కితే బయట పడేస్తామని మత్స్యకారులు ఓబులేసు, పురుషోత్తం, బాలకృష్ణ తెలిపారు.


గుత్తి చెరువులో చిక్కిన డెవిల్ ఫిష్‌ను చూపుతున్న మత్స్యకారుడు ఓబులేసు

22న విడుదల..!

(5వ పేజీ తరువాయి)

తగ్గుతాయి. దీనికితోడు దసరా పండుగకు పదిరోజుల ముందే ఈనెల 22వ తేదీ నుంచి ఈ ధరలు అమల్లోకి రానున్నాయి. దీంతో తగ్గిన అనంతరం వాహనాలను కొనడానికి ఆసక్తి చూపుతున్నారు.

ఆఫర్ ఇచ్చినా... కొనుగోలుపై అనాసక్తి

జీఎస్టీ తగ్గింపుతో అందరిచూపు ఈనెల 22పైనే ఉంది. దీంతో కేంద్ర ప్రభుత్వం ప్రకటన ఇచ్చినప్పటి నుంచి అంటే గత నెలాఖరు నుంచి వినియోగదారులు వాహనాల ధరల తగ్గింపు కోసం వేచిచూస్తున్నారు. జీఎస్టీ తగ్గింపుతో ఇప్పుడే అవే ధరలు ఇస్తాం... కొనుగోలు చేయండి అంటూ సేల్స్‌మెన్, మేనేజర్లు చెబుతున్నా వారు ససేమిరా అంటున్నారు. ఇలా ఆఫర్ ఇచ్చినా ఆసక్తి చూపకపోవడంతో వాహనాల షోరూంల నిర్వాహకులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. 'ఇప్పుడు వద్దులే బాబు... కొత్త పన్నులు అమలయ్యాకే తీసుకుంటాం' అని స్పష్టం చేస్తున్నారు. కొత్త ధరలు వచ్చాక లైఫ్ టాక్స్ తగ్గుతుందని భావిస్తుండటంతో కొనడానికి ఆసక్తి చూపట్లేదని తెలుస్తోంది.



తగ్గనున్న బైక్‌ల ధరలిలా..

మోడల్	పాత ధర	కొత్త ధర	ధర తేడా
హోండా యాక్టివా	84,173	77,238	6,935
షైన్	87,189	80,100	7,089
యూనికార్న్	1,19,327	1,09,500	9,827
సీటీ 100	70,000	62,000	8,000
పల్సర్ 125	86,000	80,000	6,000
పల్సర్ 150	1,12,000	1,03,000	9,000

పడిపోయిన బైక్‌లు, కార్ల అమ్మకాలు

జీఎస్టీ కొత్త విధానంలో బైక్‌లు, కార్ల కొనుగోలుపై తీవ్ర ప్రభావం చూపింది. అమ్మకాలు భారీగా తగ్గాయి. ప్రతినెలా 200 వాహనాలు అమ్మే ఓ బైక్ షోరూంలో ఈ నెలలో ఇప్పటి వరకు 45 వాహనాలు మాత్రమే విక్రయించామని చెబుతున్నారు. ఈ 20 రోజులలో 25 శాతం మాత్రమే అమ్మకాలు జరిగాయని శివ్‌సాయి హోండా మేనేజర్ శేషాద్రి తెలిపారు. మరో కంపెనీ షోరూంలో 100 నుంచి 120వరకు విక్రయిస్తుండగా.. అవి 30కే పరిమితమయ్యాయి. 130 నుంచి 150 వరకు బైక్‌ల అమ్మకాలు జరిగే మరో షోరూంలో 40వాహనాలు మాత్రమే సేల్ అయ్యాయి. కార్ల విషయంలో ఓ షోరూంలో ప్రతినెలా 80వరకు విక్రయించేవారు. ఈ నెలలో మాత్రం ఇప్పటి వరకు 6 మాత్రమే విక్రయించారు. ప్రతినెలా ఈ సమయానికి 40 నుంచి 45 వాహనాలు సేల్ చేసేవారమనీ, ఈసారి 15శాతం మాత్రమే జరిగిందని మహీంద్రా మేనేజర్ మస్తాన్ తెలిపారు. జీఎస్టీ ప్రభావంతో ఈసారి అమ్మకాలు తగ్గాయనీ, 22 నుంచి పెరుగుతాయని ఆశిస్తున్నామని కియ సేల్స్ హెచ్‌ఓడీ ఎల్లప్ప చెప్పారు.

తగ్గనున్న కార్ల ధరలిలా..

మోడల్	పాత ధర	కొత్త ధర	తేడా
బొలెరో	10,92,600	9,78,000	1,14,300
స్కార్పియో	23,44,001	22,11,701	1,32,300
థార్ రాక్స్	23,38,799	22,05,999	1,33,000
ఎక్స్‌యూవీ3ఎక్స్‌ఓ ఏఎక్స్7ఎల్ టీజీడీ	15,79,501	14,39,800	1,39,701
సెల్టోస్(పెట్రోల్)	11,18,900	10,79,275	36,625
సోనెట్	7,79,900	7,30,137	49,763

350 సీసీలోపు బైక్‌లపై తగ్గింపు ఇలా...

బైక్‌లకు సంబంధించి 350 సీసీలోపు మోటారు సైకిళ్ల ధరలు తగ్గుతాయి. వీటిపై 28 నుంచి జీఎస్టీ 18శాతానికి తగ్గనుంది. రాయల్ ఎన్‌ఫీల్డ్, కేటీఎం వంటి 350 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం బైక్‌ల ధరలు పెరగనున్నాయి. వీటిపై ఇదివరకు 28 శాతం జీఎస్టీతోపాటు సెస్ విధించేవారు. ఇకపై సెస్ లేకుండా 40శాతం జీఎస్టీ పన్ను పరిధిలోకి వెళ్తాయి.

కార్ల ధరలు ఎలా ఉంటాయంటే...

కార్ల విషయంలోనూ 28 నుంచి 18 శాతానికి తగ్గించారు. ఎలక్ట్రికల్ కార్లపై ప్రస్తుతం 5శాతం పన్ను విధిస్తున్నారు. ఈ రేటులో ఎలాంటి మార్పు ఉండదు. వీటిలో రూ.50వేల నుంచి రూ.1.90లక్షల వరకు తగ్గనున్నాయి. కియ కార్నివాల్ మోడల్ విషయంలో రూ.4.48లక్షలు తగ్గనుంది.

అమ్మకాలు పెరుగుతాయని ఆశిస్తున్నాం



గతంతో పోల్చితే ఈ నెలలో అమ్మకాలు తగ్గాయి. జీఎస్టీ తగ్గింపే ఇందుకు కారణమని భావిస్తున్నాం. 22 తరువాత అమ్మకాలు మరింత పెరుగుతాయని ఆశిస్తున్నాం. వాహనాల ధరను బట్టి షోరూంలో రూ.7వేల నుంచి రూ.15వేల వరకు తగ్గే అవకాశం ఉంది.
శేషాద్రి, శివ్‌సాయి హోండా మేనేజర్

అమ్మకాలపై ప్రభావం



జీఎస్టీ తగ్గింపు ప్రభావం అమ్మకాలపై పడింది. ఇది వరకు ప్రతినెలా 20వతేదీ వరకు 45 వాహనాలు అమ్ముడయ్యేవి.ఈనెల 15శాతం మించలేదు. ఈ షో రూంలో మహీంద్ర వాహనాల్లో రూ.53 వేల నుంచి రూ.1,90 ,000 వరకు తగ్గింపు రానుంది. 22 నుంచి అమ్మకాలు పెరుగుతాయని భావిస్తున్నాం.
- మస్తాన్, మహీంద్రా మేనేజర్

ఆటోల ధరలూ తగ్గనున్నాయి



జీఎస్టీ విధానంతో ఆటో ధరల్లోనూ మార్పులు రానున్నాయి. ఆటోలకైతే రూ.20 వేల వరకు, బొలెరో పికప్ లాంటి వాహనాలకైతే రూ.94వేల వరకు తేడా ఉండనుంది.
- కేశవ, జనరల్ మేనేజర్, మహీంద్రా ఆటోమొబైల్

ఈ నెల బాగా తగ్గాయి



జీఎస్టీ ప్రభావంతోనే ఈ నెలలో అమ్మకాలు తగ్గాయి. 15 నుంచి 20శాతమే విక్రయిలు జరిగాయి. ఎక్స్ షోరూం ధరపై మోడల్‌ను బట్టి రూ.8వేల నుంచి రూ.15వేల వరకు తగ్గనున్నాయి. ఈ వారం నుంచి అమ్మకాలు పెరుగుతాయని ఆశిస్తున్నాం.
- నాగరాజు, బజాజ్ మేనేజర్

బాగా తగ్గింది



ఎప్పటిలాగే దసరా సమయంలో అమ్మకాలు ఉంటాయనుకున్నాం. జీఎస్టీ కొత్త విధానం అమలుతో వినియోగదారులు ఆసక్తి చూపడం లేదు. వాహన ధరలు రూ.36వేల నుంచి రూ.1.85 లక్షల వరకు తగ్గనున్నాయి. కార్నివాల్ ధర రూ.4.48 లక్షల వరకు తగ్గనుంది.
- ఎల్లప్ప, కియ సేల్స్ హెచ్‌ఓడీ

ఆరుగురికి ఎంపీడీఓలుగా ప్రమోషన్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి జిల్లాలో ఏఓలుగా ఉన్న ఆరుగురికి డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈమేరకు వారికి ప్లేస్‌మెంట్స్ కూడా ఖరారు చేస్తు జడ్పీ చైర్‌పర్సన్ చేతులమీదుగా సీఈఓ శివశంకర్ ఉత్తర్వులు శనివారం జారీ చేశారు.

ఉద్యోగి పేరు	ఎంపీడీఓగా కేటాయించిన స్థానం
జయరాములు	గుమ్మఘట్ట
శ్రీనివాసులు	అమడగూరు
ఆనంద్‌ప్రసాద్	రొద్దం
శకుంతల	ముదిగుబ్బ
కమలాబాయి	గోరంట్ల
మాధవి	కుందుర్పి

పరీక్ష ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న జేఎన్‌టీయూఏ పరీక్షల విభాగం అధికారులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ పరిధిలో జూన్, జూలై, ఆగస్టు నెలల్లో జరిగిన బీఫార్మసీ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, ఒకటో సెమిస్టర్ సప్లిమెంటరీ, ఫార్మడీ రెండో సంవత్సరం రెగ్యులర్, సప్లిమెంటరీ, ఫార్మడీ రెండో సంవత్సరం సప్లిమెంటరీ, ఐదో సంవత్సరం అడ్వాన్స్ సప్లిమెంటరీ, ఎమ్మెస్సీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, ఒకటో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. జేఎన్‌టీయూఏ పరీక్షల విభాగం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుషన్ ఆచార్య నాగప్రసాద్ నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్ ఆచార్య శివకుమార్, అడిషినల్ కంట్రోలర్ శంకర్‌శేఖర్‌రాజు, డా. శ్రీధర్ ఫలితాలను శనివారం ప్రకటించారు. జేఎన్‌టీయూఏ వెబ్ సైట్‌లో ఫలితాలు చూసుకోవచ్చని వర్సిటీ అధికారులు తెలిపారు.

టమోటా రూ.22.. చీనీ రూ.16 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.22 కనిష్ఠ ధర రూ.14, సరాసరి ధర రూ.17 పలికాయి. యార్డుకు శనివారం 2250 టన్నుల టమోటాలు వచ్చాయని రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధరరూ.12వేలు పలికాయని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో తల్లీబిడ్డల మృతి


తల్లీబిడ్డల మృతదేహాలు

పావగడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో తల్లి, తన ఇద్దరు బిడ్డలకు ఉరివేసి తాను కూడా ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన తాలూకా పరిధిలోని కడపలకెరె గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. సరిత(28) అదే గ్రామానికి చెందిన సంతోష్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల రిష్విక్ యాదవ్, రెండేళ్ల యుక్తి ఉన్నారు. కుటుంబ కలహాలతో తరచూ గొడవపడేవారని స్థానికులు తెలిపారు. శనివారం సాయంత్రం ఏం జరిగిందో కానీ ఎవరూ లేని సమయంలో తన ఇద్దరు పిల్లలకు ఉరివేసి తాను ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు భర్త సంతోష్ తెలుపడంతో సరిత తల్లి శాంతమ్మ, తండ్రి ఓబిరెడ్డి కన్నీటి పర్యంతమయ్యారు. అయితే తన కుమార్తె అలాంటిదికాదని ఇది అనుమానాస్పద మృతి అని మృతికి కారణమైన వారిపై కేసు నమోదుచేసేంతవరకు మృతదేహాలను తాకనీయమని కుటుంబికులు భీష్మించారు. ఘటనా స్థలానికి డీవైఎస్పీ మంజునాథ్ చేరుకుని సంఘటన వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన తరువాతే హంతకులెవరనేది, తేలుతుందని నచ్చచెప్పడంతో మృతదేహాలను పావగడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు వారు ఒప్పుకున్నారు.

ప్రపంచం గర్వించే స్థాయికి పట్టు ఎగుమతులు

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



సీఎస్‌బీ వార్షికోత్సవాలలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టు ఎగుమతుల్లో భారత్ ప్రపంచం గర్వించే స్థాయికి ఎదిగిందని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సెంట్రల్ సిల్క్ బోర్డు(సీఎస్‌బీ) 76వ వ్యవస్థాపక వేడుకలు బెంగళూరులోని డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎంపీ అంబికా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టు పరిశ్రమ అభివృద్ధిలో సీఎస్‌బీ 75 ఏళ్లుగా నిర్విరామంగా సేవలు అందిస్తోందన్నారు. పట్టు ఎగుమతులు రూ.3 లక్షలు నుంచి రూ.2356 కోట్లకు పెరగడం గర్వకారణమని తెలిపారు. ఏపీ రైతుల సంక్షేమం దృష్ట్యా పట్టుగుళ్లకు గతంలో ఇచ్చిన ప్రోత్సాహకాన్ని మళ్లీ ప్రారంభించాలని ఆయన కేంద్రాన్ని కోరారు. సిల్క్‌సమగ్ర పథకం కింద షెడ్ల నిర్మాణానికి అందించే ఆర్థిక సాయం రూ.12 లక్షలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ సుధాకర్, టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ పద్మిని సింగ్లా, సీఎస్‌బీ మెంబర్ సెక్రెటరీ శివకుమార్, దేశవ్యాప్తంగా పట్టు రైతులు, నేతన్నలు, శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

'సొసైటీలను ఉద్యానవనాల్లా మారుస్తాం'


మొక్కలు నాటుతున్న డీసీఎం అరుణకుమారి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని సొసైటీ కార్యాలయాల వద్ద విరివిగా మొక్కలు నాటి ఉద్యానవనంలా మారుస్తామని జిల్లా సహకార శాఖ అధికారి అరుణకుమారి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు తెలిపారు. స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కమలానగర్‌లో ఉన్న డీసీఎంఎస్ కార్యాలయం వద్ద వారు పరిసరాలను శుభ్రం చేసి, మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే అనే నినాదంతో మొక్కలు నాటి పర్యావరణ కాలుష్యాన్ని నివారించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ విజయభాస్కర్, అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, జిల్లా సహకార శాఖ కార్యాలయం సూపరింటెండెంట్ మునికృష్ణారెడ్డి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా లఘుచిత్రాల ప్రదర్శన

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): భాషా, సాహిత్యం, కళలు, ఇతర ఆచారాలను గౌరవించడం ద్వారానే తెలుగు వికాసం, సంస్కృతి రక్షించబడుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గుంటూరు భారతీయ విద్యా భవన్‌లో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు 2026 సన్నాహాల్లో భాగంగా శనివారం తెలుగు భాషా వికాసంపై ఎంపిక చేసిన 44 లఘు చిత్రాల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్టీఆర్ తన చిత్రాల ద్వారా భాష ఉన్నతికి కృషి చేశారని, ఆయన అడుగుజాడల్లో పయనించాలన్నారు. మాజీ ఎంపీ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాదు మాట్లాడుతూ జాతి అస్తిత్వానికి మాతృభాష కొలమానమని అన్నారు. గ్రాంథిక భాష నుంచి వ్యవహారిక భాష ప్రాధాన్యతను గుర్తించి దాని అభివృద్ధికి విశేషంగా కృషిచేసిన గిడుగు రామ్మూర్తి తెలుగు భాషోద్యమ పితామహుడు అని కొనియాడారు. తూర్పు ఎమ్మెల్యే నజీర్ మాట్లాడుతూ ప్రత్యేక మంత్రిత్వ శాఖ ద్వారా తెలుగు భాషా వికాసానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు పొడపాటి తేజస్విని మాట్లాడుతూ వేమన, సుమతి శతకాలు ద్వారా తెలుగు భాష మాధుర్యాన్ని రుచి చూస్తారన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరిలో జరుగనున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు చరిత్రలో చిరస్థాయిగా మిగిలేలా కృషి చేస్తున్నట్టు వివరించారు. అనంతరం ప్రదర్శించిన లఘచిత్రాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా గిడుగు రామ్మూర్తి పంతులుపై కొత్తపల్లి సీతారాం నిర్మించి దర్శకత్వం వహించిన కృత్రిమ మేధస్సుతో రూపొందించిన 'తెలుగు వెలుగు గొడుగు గిడుగు" లఘు చిత్రం విశేషంగా ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో వివిఐటి విసి వాసిరెడ్డి విద్యాసాగర్, బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ బుచ్చిరాంప్రసాద్, సినీ ప్రముఖులు దశరథ్, కోన వెంకట్, డివై చౌదరి, బివిఎస్ రవి తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్ సవీరాలో మృతదేహానికి వైద్యం..?

- అర్ధరాత్రి మృతురాలి బంధువుల ఆందోళన
- రూ.రెండు లక్షల బిల్లు చెల్లించిన బాధితులు
- పెండింగ్ బిల్లు కోసం ఆస్పత్రి వర్గాల డిమాండ్
- కేసు నమోదుకు పోలీసులు ససేమిరా


పార్వతి (ఫైల్)

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మృతదేహానికి వైద్యం చేసి, బిల్లులు వేశారని ఆరోపిస్తూ ధర్మవరం పట్టణానికి చెందిన బాధితులు నగరంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రి వద్ద శనివారం రాత్రి ఆందోళనకు దిగారు. అనారోగ్యంతో కిమ్స్ సవీరా ఆస్పత్రిలో చేరిన పార్వతి(39) చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతురాలి బంధువులు జయకృష్ణ, గాయత్రి తెలిపిన మేరకు, ధర్మవరం పట్టణానికి చెందిన పార్వతి అనారోగ్యంతో బాధపడుతుండటంతో గురువారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శుక్రవారం రాత్రి కిమ్స్ సవీరా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు అడ్మిట్ చేసుకుని, వైద్యం చేస్తున్నామని మెడిసిన్, ఐసీయూ పేరుతో రూ.2 లక్షల వరకు బిల్లు వసూలు చేశారు. ఆపై ఆస్పత్రి బిల్లు భరించే శక్తిలేకపోవడంతో వేరే ఆస్పత్రికి వెళ్తామని పార్వతి బంధువులు డాక్టర్లను శనివారం అడిగారు. దీంతో వారు వెంటిలేటర్‌పై తీసుకెళ్లాలని సూచించి.. పార్వతి మృతదేహాన్ని అప్పగించారు. కానీ పెండింగ్ బిల్లు చెల్లించాకే వెళ్లాలని సూచించారు. పార్వతి శుక్రవారం రాత్రే మృతి చెందినట్లు బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయిద్దామంటే ఆస్పత్రి వారు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులను పిలిపించి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లాలని బెదిరిస్తున్నారని వాపోయారు. 'అర్ధరాత్రి అయినా ఇక్కడే ఉన్నాము. పోస్టుమార్టం చేసి మాకు న్యాయం చేయాలి. అప్పటి వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదు' అని వారు భీష్మించారు. ఈ వివాదంపై ఆస్పత్రి పర్యవేక్షణ సిబ్బందిని వివరణ కోరగా.. తీవ్ర అనారోగ్యంతో పార్వతి మృతి చెందారని అన్నారు. పోస్టుమార్టం కావాలంటే డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేయాలని సీఐ జగదీష్ సూచించారు. అప్పటి వరకూ బాధితుల నుంచి కేసు తీసుకునే ఆస్కారం లేదని అన్నారు.


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

న్యూస్ బాక్స్

కలెక్టర్, ఎస్పీని కలిసిన చిలకం





జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్‌ను జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిలకం మధుసూదన్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారివారి కార్యాలయాల్లో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు.
- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి టౌన్

'మహిళలను తప్పుదోవ పట్టిస్తున్న సీఐటీయూ నాయకులు'


వెలుగు ఏపీఎంకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

బుక్కపట్నం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వెలుగు సంఘాల మహిళలను సీఐటీయూ, సీపీఎం నాయకులు తప్పుదోవ పట్టిస్తూ, సమస్యలను సృష్టిస్తున్నారని పవిత్ర మండల సమాఖ్య సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం మండలకేంద్రంలోని వెలుగు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, వెలుగు ఏపీఎంకు వినతిపత్రం అందించారు. సంతోషిమాత సంఘంలో జరిగిన ఆర్థిక పరమైన విషయాల్లో సంఘం సభ్యులకు న్యాయం చేస్తామని మహిళలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఈ విషయంపై పీడీ ఆదేశాల మేరకు ఇదివరకే అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారన్నారు. అయితే సీఐటీయూ నాయకులు వెలుగు సీసీ రవి, యానిమేటర్ నాగరాజుపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. అనంతరం పీడీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వెలుగు సంఘాల మండల సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, రికవరీ కమిటీ అధ్యక్షురాలు గాయత్రి, వెలుగు మహిళ అధ్యక్షురాలు లావణ్యగౌడ్, మహిళలు పాల్గొన్నారు.

సేవా పక్షోత్సవాలు

కొత్తచెరువు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించు కుని సేవా పక్షోత్సవాను శనివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకుడు రామానాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీలో రోగులకు అల్పాహారంతో పాటు పాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు. అనంతరం కేక్‌కట్ చేసి ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణగౌడ్, జిల్లా కోశాధికారి సురేంద్రబాబు, నాయకులు బాలగంగాధర్, జయరాం, ఎల్వీ రమేశ్‌బాబు, కుమార్, గంగానాయుడు, సుదర్శన్‌నాయుడు, శేషాద్రినాయుడు, రఫీ, విష్ణు, టీడీపీ పట్టణ కన్వీనర్ వలిపి శీన, నాయకులు నల్లమాడ శంకర్ పాల్గొన్నారు.

'మహాకవి గురజాడ'

ధర్మవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గురజాడ లాంటి గొప్ప కవిని మనమందరం స్మరించుకోవాలని టూటౌన్ సీఐ రెడ్డప్ప విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని వివేకానంద డిగ్రీకళాశాలలో శనివారం ఎస్ఎఫ్ఐ, జేవీవీ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి గురజాడ అప్పారావు జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ముఖ్యఅతిథులుగా సీఐతో పాటు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, విశ్రాంత లెక్చరర్ కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ హర్షవర్ధన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున పాల్గొన్నారు. సీఐ మాట్లాడుతూ... దేశమంటే మట్టికాదు దేశమంటే మనుషులు అన్న గురజాడ మాట తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్మణీయంగా నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ రమేశ్, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అమన్, శ్రీనాథ్, బాలాజీ, అఖిల్ పాల్గొన్నారు.

పాఠశాల కమిటీ చైర్మన్ ఎన్నిక

గాండ్లపెంట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా బాబ్‌జాన్‌ను శనివారం ఎన్నుకున్నారు. గతంలో ఉన్న చైర్మన్ రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో కమిటీ సభ్యులు బాబ్‌జాన్‌ను ఎన్నుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఆయనను కూటమి నాయకులు వెంకటరమణారెడ్డి, హెచ్ఎం సురేష్, అక్రమ్‌బాషా, సికిందర్, లక్ష్మీనరసారెడ్డి, బావా, సిద్ధారెడ్డి, పూలమాలలు వేసి అభినందించారు.

'రూపరాజా'లో ఘనంగా దసరా ఉత్సవాలు


పౌరాణిక వేషధారణలలో విద్యార్థులు

ధర్మవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగలూరు వద్ద ఉన్న రూపరాజా పీసీఎంఆర్ పాఠశాలలో దసరా ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దుర్గాదేవి, మహిషాసురుడు, శ్రీరాముడు, సీత, రావణాసురుడు వేషధారణలో అలరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్, పాఠశాల డైరెక్టర్లు రూపరాజాకృష్ణ, జగదీశ్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేశ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెల మృతి

గాండ్లపెంట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడ్డివెలగల పంచాయతీ వంకలోపల్లిలో శనివారం విద్యుదాఘాతంతో రెండు గొర్రెలు మృతిచెందాయి. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి విద్యుత్ సరఫరా అయి తన రెండు గొర్రెలు మృతిచెందాయని బాధిత రైతు శివప్పనాయుడు తెలిపారు. ఈవిషయంపై ట్రాన్స్‌కో లైన్ ఇన్‌స్పెక్టర్ నరసింహులు, లైన్‌మ్యాన్ రెడ్డిబాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్ స్తంభానికి ఉన్నవీధి దీపం న్యూట్రల్ వైర్ ఫెయిల్ అయిందని, దీంతో విద్యుత్ స్తంభానికి కరెంటు వచ్చి గొర్రెలు మృతిచెందాయని వారు తెలిపారు. విద్యుత్ శాఖ తరపు నుంచి గొర్రెల ప్రమాద బీమాను రైతుకు అందిస్తామని వారు తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బుక్కపట్నం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిండ్రగుట్టపల్లిలో శుక్రవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ క్రిష్ణమూర్తి తెలిపారు. టీడీపీ నాయకులు డీలర్ బోయ రామచంద్ర ఫిర్యాదు మేరకు వైసీపీకి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, పద్మావతిపై కేసు నమోదుచేశామన్నారు. అలాగే వైసీపీకి చెందిన బాలిరెడ్డి ఫిర్యాదు మేరకు బోయ రామచంద్ర, నరసింహయ్య, లక్ష్మణ్, వీరేష్, క్రిష్ణమ్మపై కేసు నమోదు చేశామన్నారు.

గుంతల రోడ్డు

● ప్రయాణం నరకప్రాయం ● ఇబ్బందుల్లో వాహనదారులు


గుంతలుపడి ప్రమాదకరంగా ఉన్న రహదారి



ధర్మవరం రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కదిరిగేటు సమీపంలో మున్సిపల్ కార్యాలయం నుంచి ధర్మవరంలోకి వచ్చే దారిలో శ్మశానవాటిక వరకు రహదారి గుంతలు ఏర్పడి ప్రయాణానికి ప్రమాదకరంగా మారింది. దీంతో ఆ రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. గుంతల వద్ద ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కిందపడి గాయాల పాలవుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. వర్షం కురిస్తే గుంతల్లోకి నీరు చేరుతుందని, దీంతో రహదారి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదమరిచి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురికావాల్సిందేనని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై గుంతలను పూడ్చాలని, ప్రమాదాల బారి నుంచి కాపాడాలని వాహనదారులు కోరుతున్నారు.

మొక్కలు నాటి సంరక్షిద్దాం

● పర్యావరణాన్ని కాపాడదాం..
● న్యాయాధికారులు, అధికారులు


కదిరి కోర్టు వద్ద మొక్క నాటుతున్న న్యాయాధికారులు జయలక్ష్మి, లోకనాథం

కదిరి లీగల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మొక్క నాటడంతో బాధ్యత తీరిపోదని, నాటిన ప్రతి మొక్కను బతికించినప్పుడే సార్థకత అని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ కోర్టు న్యాయాధికారి జయలక్ష్మి పేర్కొన్నారు. న్యాయాధికారి జయలక్ష్మి శనివారం మరో న్యాయాధికారి లోకనాథం, న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో కలసి కదిరిలోని కోర్టు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా హైకోర్టు, జిల్లా కోర్టు ఆదేశాల మేరకు శనివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చౌడప్ప, ఏజీపీ శివప్రసాద్, కోర్టుల పర్యవేక్షకులు శివారెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● పుట్టపర్తిరూరల్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు విరివిగా నాటాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ముజీబ్ పసపల సయ్యద్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో శనివారం న్యాయాధికారి ముజీబ్ పసపల సయ్యద్ వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలునాటి పర్యావరణ ప్రాముఖ్యతను వివరించారు. ఆర్డీఓ సువర్ణ, తహసీల్దార్ క ళ్యాణ్, పుట్టపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తిగంగిరెడ్డి, న్యాయవా దులు అతావుర్ రహిమాన్, లెక్కల యదుభూషణ్, ఇందిర, సూపరెడ్టెంట్ బాలాజీ నాయక్, కోర్టు సిబ్బంది మంజునాథ్, జ్యోతిబాయి, అటవీసిబ్బంది పాల్గొన్నారు.

● ధర్మవరం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, తదారాఆ పర్యావరణాన్ని కాపాడాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి నందిని పేర్కొ న్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కోర్టు ఆవరణంలో శనివారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ నేతృత్వంలో న్యాయాధికారి మొక్కలునాటారు. బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి డీఎల్ఎన్ మూర్తి, న్యాయవాదులు బాబా, బిల్లే రవీంద్ర, భాస్కర్‌గౌడ్, సుబ్బరాయుడు, కోర్టు సిబ్బంది, అటవీ శాఖ అధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

● గాండ్లపెంట/నంబులపూలకుంట: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శులకు శనివారం స్వచ్ఛభారత్ రాష్ట్ర డైరెక్టర్ పర్వీన్‌బాను సూచించారు. ఆమె గాండ్లపెంటలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో, నంబులపూలకుంటలోని పాఠశాల ఆవరణంలో మొక్కల నాటారు. మండలాల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● నల్లచెరువు/కదిరి/తనకల్లు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డీఎల్‌డీఓ వెంకటరత్నం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులతో బస్టాండ్ కూడలి వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. అలాగే కదిరిలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు కదిరి రీజనల్ మేనేజర్ పి.రమేష్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ కార్యాలయం అవరణలో మొక్కలు నాటారు. తనకల్లు మండలపరిధిలోని రాచువారిపల్లి సమీపంలో ఉన్న కేజీబీవీలో శనివారం అధికారులు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు.


జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో న్యాయాధికారి ముజీబ్ పసపల సయ్యద్


ధర్మవరం కోర్టు ఆవరణలో న్యాయాధికారి నందిని

కొనసాగిన దస్తావేజు లేఖరుల నిరసన

ధర్మవరం/కదిరి/తనకల్లు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏపీఐజీఆర్ఎస్ సైట్‌లో ఎదురవుతున్న సమస్యను పరిష్కరించాలని కోరుతూ దస్తావేజు లేఖరులు రెండో రోజు శనివారం స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు క్రిష్టాపురం జావీద్‌బాషా, ఉపాధ్యక్షుడు బారు భాస్కర్, సెక్రటరీ జూటూరు మహేంద్ర, జాయింట్ సెక్రటరీ తొండమాట నాగార్జున, ట్రెజరర్ శింగేటి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. అలాగే కదిరిలో డాక్యుమెంట్ రైటర్లు చేస్తున్న పెన్‌డౌన్ సమ్మె శనివారం రెండో రోజు కొనసా గింది. పలువురు డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు. తనకల్లులోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద స్టాంపు రైటర్లగా పనిచేస్తున్న వారు రెండురోజులుగా పెన్‌డౌన్ ప్రకటించారు. శనివారం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు.

వసతి గృహాన్ని పరిశీలించిన పర్వీన్‌బాను


వసతిగృహాన్ని పరిశీలిస్తున్న పర్వీన్‌బాను

గాండ్లపెంట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ వసతి గృహాన్ని స్వచ్ఛభారత్ డైరెక్టర్ పర్వీన్‌బాను శనివారం పరిశీలించారు. 'అసౌకర్యా ల వసతి గృహం' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో శనివారం వార్త ప్రచురితమైన విషయం విదితమే. ఈ వార్తకు స్పందించిన పర్వీన్‌బాను బీసీ వసతి గృహాన్ని, బాత్‌రూమ్‌లు, వంటగదిని పరిశీలించారు. అవి పరిశుభ్రంగా లేవన్నారు. వసతి గృహంలో ఫ్యాన్లు తిరగడం లేదన్నారు. ఈ సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఫోన్‌లో వార్డెన్ జయరామిరెడ్డికి తెలిపారు. దసరా సెలవుల తరువాత అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆమెతో పాటు మండల నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి కి స్పందన

'రోడ్లపైకి మురుగునీరు వదిలితే చర్యలు'

కదిరి, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): రోడ్లపై మురుగు నీరు, చెత్త పారవేస్తే చర్యలు తప్పవని మండలస్థాయి అధికారులు హెచ్చరించారు. 'రోడ్లపైనే మురుగునీరు' అనే శీర్షికతో శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. మండలకేంద్రంలోని దుకాణాలు, హోటళ్ల యజమానులతో అధికారులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఎంపీడీఓ పోలప్ప, తహసీల్దార్ రెడ్డి శేఖర్, ఏఎస్ఐ గుర్రప్ప మాట్లాడుతూ.. రోడ్లపై మురుగునీరు, చెత్త వేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. రోడ్ల చెత్త వేసిన వారి మీద ఎవరైనా రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను స్వచ్ఛ సేవా కార్మికులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల రణభేరి పోస్టర్ల విడుదల

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 25న గుంటూరులో తలపెట్టిన రణభేరి ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. సంబంధిత పోస్టర్లను శనివారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, మున్సిపల్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విడుదల చేశారు. యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు, సుధాకర్, భార్గవ్, మధుసూదన్‌రెడ్డి, సునిల్‌కుమార్, రాజేష్, నాగరాజు తదితరులు ఉన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తాహేర్‌వలి గాండ్లపెంట కటారుపల్లి, రెక్కమాను పాఠశాలల్లో రణభేరి పోస్టర్లను విడుదల చేశారు. అలాగే యూటీఎఫ్ నాయకలు ఓబుళదేవరచెరువు ఉన్నత పాఠశాలలో పోస్టర్లను ఆవిష్కరించారు.

'ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయండి'

ఓబుళదేవర చెరువు/నంబులపూలకుంట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఫ్యాప్టో రాష్ట్రశాఖ పిలుపు మేరకు అక్టోబరు 7న విజయవాడలో తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో జిల్లా కార్యదర్శి కట్టుబడి గౌస్‌లాజం, శనివారం కోరారు. ఓబుళదేవరచెరువు మండలకేంద్రంలో ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు సోమశేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఫ్యాప్టో చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నంబుల పూలకుంటలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో అక్టోబరు 7న చేపట్టే చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు.


వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్శినమల గ్రామంలో శనివారం ఓ వ్యక్తిపై కట్టెలు, రాయితో దాడిచేసి నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన కొండపాకుల ఓబిలేసు, పోతలయ్య గతంలో గొడవపడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. పాతగొడవ నేపథ్యంలో కేసు రాజీకి రమ్మంటే రావా అంటూ ఓబిలేసుపై పోతలయ్య, బొజ్జెప్ప కలిసి దాడికి తెగబడ్డారు. కట్టెలు, రాయితో దాడిచేయడంతో ఓబిలేసు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని గ్రామస్థులు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడు ఓబిలేసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్యపై కత్తితో దాడి

నల్లచెరువు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని యల్లమ్మస్వామి వీధిలో దంపతులు బాలామణి, నారాయణస్వామి నివాసముంటున్నారు. కొంతకాలంగా భార్య, భర్తల మధ్య చిన్న తగాదాలు జరగుతుండేవి. శనివారం బాలామణి ఇంటిలో పనిచేసు కుంటుండగా ఆమె భర్త నారాయణస్వామి కత్తితో దాడిచేసినట్లు వారి కుమారుడు రాఘవ తెలిపారు. గాయపడిన ఆమెను 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కుమారుడు రాఘవ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వెంటనే సమస్యలు పరిష్కరించాలి: వీఆర్‌ఏలు


పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శన

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలంటూ వీఆర్‌ఏలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద అర్ధనగ్న నిరసన ప్రదర్శనకు దిగారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి అంజనేయులు నిరసన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర కమిటీపిలుపు మేరకు ఈనెల 22న కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతామన్నారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే చలో విజయవాడ నిర్వహిస్తామని హెచ్చరించారు. జిల్లా వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు గంగాద్రి, కార్యదర్శి పెద్దన్న, సీపీఐ నాయకులు వినోద్, షేక్షావలి పాల్గొన్నారు.

● ధర్మవరం: వీఆర్‌ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు తుంపర్తి పరమేశ్ డిమాండ్‌చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట వీఆర్‌ఏలు మూడో రోజు ధర్నా కొనసాగించారు. సీపీఐ, కాంగ్రెస్, ఏపీచేనేత కార్మికసంఘం నాయకులు మద్దతు ప్రకటించారు. సీపీఐ సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, చేనేత కార్మికసంఘం జిల్లా కార్యదర్శి బుడగ వెంకటనారాయణ, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సకలరాజా, మహిళా సమాఖ్య నాయకులు లలితమ్మ, లింగమ్మ, ఈరమ్మ, ప్లంబర్స్ అసోసియేషన్ నాయకులు గోవిందరాజులు, ఆదినారాయణ, పెద్దన్న, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

● ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె


కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో జిల్లా అభివృద్ధి, ప్రజల అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచేస్తానని కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలియచేశారని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను వారు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి పట్టుశాలువాతో సన్మానించారు. రానున్న సత్యసాయి శతజయంతి ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా ఘనంగా నిర్వహిద్దామని కలెక్టరుతో ప్రస్తావించినట్లు తెలిపారు. ట్రస్టు సహకారంతో జయంతి ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి త్వరలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిద్దామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేతోపాటు కూటమినాయకులు పాల్గొన్నారు.

ఈవీఎంల గోడౌన్ తనిఖీ


ఈవీఎంల గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

ధర్మవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌యార్డ్‌లో ఉన్న ఈవీఎంల గోడౌన్ లను గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ శ్యాంప్రసాద్ శనివారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం నెలవారీ తనిఖీల్లో భాగంగా ఆ గోడౌన్‌ల భద్రతకు తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించారు. భద్రతా నిబంధనలపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సజావుగా యూరియా పంపిణీ చేయాలి

● కలెక్టర్ శ్యాంప్రసాద్ ● ఎరువుల దుకాణాల్లో తనిఖీ

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులు ఇబ్బందులు పడకుండా యూరియాను సజావుగా పంపిణీ చేయాలని అధికారులను కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్దగల శ్రీబాలాజీ ఫర్టిలైజర్ దుకాణాన్ని కలెక్టర్ శనివారం తనిఖీ చేశారు. యూరియా నిల్వ, పంపిణీపై ఆరాతీశారు. స్టాకు వివరాలు ప్రదర్శించాలన్నారు. ఆయన వెంట ఆర్డీఓ మహేష్, ఇన్‌చార్జి తహసీల్దార్ ఈశ్వరయ్య ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ ముస్తఫా ఉన్నారు.

పీ4 మార్గదర్శకులను గుర్తించండి

● పుట్టపర్తి టౌన్: పీ4 పథకం విజయవంతానికి బంగారు కుటుంబాల మార్గదర్శకులను గుర్తించాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక సాయిఆరామం ఫంక్షన్ హాల్‌లో స్వచ్ఛాంధ్ర 2047 అమలుపై గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. ఆర్థిక అసమానతలు తగ్గించి, నిరుపేదలను ఆదుకోవడమే పీ4 ఉద్దేశమన్నారు. విజయవంతానికి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. 45 రోజుల్లో బంగారు కుటుంబాలు, మార్గదర్శుల గుర్తింపు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో శిక్షణాధికారులు సందీప్, రాజశేఖర్, సీపీఓ విజయ్‌కుమార్, జిల్లాలోని వార్డు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా: ఏఓ

బత్తలపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులెవరూ యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, అందుబాటులో ఉందని ఏఓ ఓబిరెడ్డి తెలిపారు. మండలపరిధిలోని మాల్యవంతం గ్రామంలో శనివారం ఆయన టీడీపీ మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డితో కలిసి రైతులకు పంపిణీ చేశారు. మండల రైతులకోసం 21.9 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. మాల్యవంతం, ముస్టూరు, అప్రాచెరువు రైతుసేవా కేంద్రాలలో 7.3 మెట్రిక్ టన్నులు చొప్పున ఉంచామని తెలిపారు.

ఈ-పంట నమోదు పూర్తి చేయండి: జేసీ

నల్లమాడ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ-పంట నమోదును నెలాఖరులోగా పూర్తిచేయాలని జేసీ అభిష్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని రెడ్డిపల్లిలో సంధ్య ఫర్టిలైజర్ దుకాణం, గోడౌన్‌ను ఆయన శనివారం తనిఖీ చేశారు. అలాగే స్టాక్‌ను పరిశీలించారు. ఇప్పటివరకు మండలానికి ఎంత యూరియా వచ్చిందని ఏఓ అబ్దుల్‌హక్‌ను అడిగి తెలుసుకున్నారు. యూరియా అవసరముంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అనంతరం రెడ్డిపల్లి రెవెన్యూ గ్రామంలో రైతు పాపిరెడ్డి సాగుచేసిన వేరుశనగ ఈ-పంట నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగనాయకులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది షాన్వాజ్, వీఆర్‌ఓ సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

వార్డులో సమస్యలను పరిష్కరించండి

● కలెక్టర్‌కు టీడీపీ నాయకుల వినతి


కలెక్టర్‌కు వివరిస్తున్న నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని 25వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆ వార్డు టీడీపీ అధ్యక్షుడు భీమనేని ప్రసాద్ నాయుడు, నాయకులు చీమల రామాంజి తదితరులు శనివారం కలెక్టర్‌కు విన్నవించారు. ధర్మవరానికి వచ్చిన కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా వార్డులో హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద డ్రైనేజీ దెబ్బతిని మురుగునీరంతా రోడ్డుపైకి ప్రవహిస్తోందనితెలిపారు. వార్డులో 1700 ఇళ్లు ఉన్నాయని, అయితే పారిశుధ్య కార్మికులు నలుగురు మాత్రమే ఉన్నారని అన్నారు. పారిశుధ్యకార్మికుల సంఖ్యపెంచాలన్నారు. వార్డు సచివాలయంలో ఖాళీగా ఉన్న శానిటరీ సెక్రటరీ, ఏఎన్ఎం పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ప్రియాంకనగర్‌లో మలుపు వద్ద మెయిన్‌రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు వేయించాలని, వార్డులో లో ఓల్టేజ్ సమస్య పరిష్కరించాలని ఆయన కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

ఇరిగేషన్ కాలువ పరిశీలన

పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో ఉన్న ఇరిగేషన్ కాలువను ఇన్‌చార్జ్ కమిషనర్ సాయికృష్ణ, డీఈ వీరేశ్ పరిశీలించారు. కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను వార్డు ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నా యుడు, నాయకులు చీమల రామాంజి, సీబీఎస్ రామకృష్ణ, క్లస్టర్ రామాంజి, స్థానికులు కలిసి ఇరిగేషన్ కాలువ పరిస్థితి వివరించారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు కమిషనర్ కాలువను పరిశీలించారు.

న్యూస్ బాక్స్

వర్షాలకు దెబ్బతిన్న బూదిలి వంతెన



బూదిలి వద్ద దెబ్బతిన్న చిత్రావతి వంతెన

గోరంట్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు చిత్రావతి ప్రవాహంతో బూదిలి వంతెన దెబ్బతిని, రాకపోకలు స్తంభించిపోయాయి. మండలంలోని బూదిలి వద్ద నున్న చిత్రావతి వంతెన శుక్రవారం ప్రవాహానికి దెబ్బతినింది. కదిరి వైపునుంచి ప్రతిరోజు బెంగుళూరు వైపు, పెనుకొండ కియ పరిశ్రమకు ఈమార్గం గుండా వెళ్లేవి. వంతెన దెబ్బతినడంతో రెండురోజులుగా రాకపోకలు నిలిపివేశారు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో ప్రమాదాలను అరికట్టడానికి వంతెనకు ఇరువైపు బ్యారికేడ్లు పెట్టారు. టీడీపీ కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, నిమ్మల శ్రీధర్ దెబ్బతిన్న వంతెను పరిశీలించారు.

చిన్నారులకు ఎమ్మెల్యే పీఏ భరోసా



అనాథలైన పిల్లలతో ఎమ్మెల్యే పీఏ వీరయ్య

చిలమత్తూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన అన్నపూర్ణమ్మ(38) రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు ఉన్న ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. విషయాన్ని వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీదేవి, మండల కన్వీనర్ శ్రీనివాసులు హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య దృష్టికి శనివారం తీసుకెళ్లారు. అన్నపూర్ణమ్మ భర్త చాలా కాలం క్రితమే మరణించాడు. అప్పటి నుంచి ఆమె పిల్లలైన 7వ తరగతి చదువున్న గౌతమ్, 4వ తరగతి చదువున్న గగనను ప్రభుత్వం అందించే పింఛన్ సొమ్ముతోనే పోషించుకుంటోంది. ఆమె అనారోగ్యంతో మృతిచెందడంతో వారు అనాథలుగా మారిపోయారు. ఆయన పిల్లల పరిస్థితిని తెలుసుకొని వారికి సాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఆయన వేతనం నుంచి రూ.10 వేలు తక్షణ సాయంగా పిల్లలకు అందించారు. అనంతరం మాట్లాడుతూ ఇటువంటి తల్లిదండ్రులు లేని పిల్లలకు మంగళగిరిలోని ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా చదువుకునే అవకాశం ఉందని, ఈ విషయాన్ని ట్రస్టుతో మాట్లాడి అక్కడ చేర్పించే ఏర్పాట్లు చేస్తామన్నారు.

సేవా పక్వాడ్ కార్యక్రమం



ఆలయం వద్ద మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పులేకమ్మ ఆలయం ఎదురుగా ఉద్యానవనంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ ఆధ్వర్యంలో సేవాపక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని మొక్కలను నాటారు. వారు మాట్లాడుతూ 17నుంచి అక్టోబరు 2వరకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎనుమల రామక్రిష్ణ, మమత, గోపీనాథ్, రవి, రామాంజనేయులు, శ్రీనివాసులు, హనుమంతుయాదవ్ పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపు



ట్యాంకు చుట్టూ ఉన్న కంపచెట్లను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సోమందేపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తికుంటపల్లి గ్రామ సమీపంలోని నీటి ట్యాంకు పరిసరాలను అధికారులు శుభ్రం చేయించారు. గుబురు చెట్లమధ్య నీటి ట్యాంకు అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఇందుకు అధికారులు స్పందించి ట్యాంకు చుట్టూ ఉన్న పరిసరాలను ఎక్స్‌కవేటర్ సాయంతో ముళ్లకంపలు తొలగింపచేశారు. పంచాయతీ కార్యదర్శి జయరాం మాట్లాడుతూ ఆది, సోమవారాల్లో ట్యాంకు క్లోరినేషన్, పైపుల మరమ్మతులను చేపడతామన్నారు. ప్రజలకు శుద్ధినీటిని అందిస్తామన్నారు.

వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం

పెనుకొండ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడదాకులపల్లి గ్రామానికి చెందిన సంతోష్‌నాయక్ అనే విద్యార్థికి నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు లభించింది. కళాశాలలో చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న స్థానిక జూనియర్ కళాశాల అధ్యాపకులు ఆర్థిక సాయాన్ని అందించారు. శనివారం స్థానిక కళాశాల వద్ద విద్యార్థి సంతోష్‌నాయక్‌కు ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపక బృందం రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

జిల్లా న్యాయాధికారిని కలిసిన న్యాయవాదులు

హిందూపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): హిందూపురానికి వచ్చిన జిల్లా న్యాయాధికారి భీమరావును న్యాయవాదులు కలిశారు. శనివారం జిల్లా న్యాయాధికారి తనిఖీ నిమిత్తం హిందూపురానికి వచ్చిన సందర్భంగా న్యాయవాదుల సంఘం నాయకులు కలిసి నూతన కోర్టు భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. వన్నేరప్ప, రామచంద్రప్ప, రామచంద్రారెడ్డి, ఇందాద్, శివశంకర్, జయరాం, వెంకటేశ్, ఆసిఫ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

పరిగి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టగూర్లపల్లి గ్రామానికి చెందిన హనుమంతప్ప(60) రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. జమేదార్ శ్రీనివాసులు తెలిపిన మేరకు హనుమంతప్ప పాలప్యాకెట్ కోసం గ్రామం నుంచి మెదాగేటు సమీపంలో నడుచుకుని వెళ్తుండగా జనసేన పార్టీ కార్యాలయం వద్ద పాలడెయిరీ వాహనం అతి వేగంగా వచ్చి ఢీకొనడంతో హనుమంతప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో హోంగార్డు..



రహిమాన్ (ఫైల్)

అమరాపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ రహిమాన్(39) అనారోగ్యంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. హోంగార్డుకు భార్య, కుమార్తె ఉన్నారు. మడకశిర రూరల్ సీఐ రాజకుమార్, ఎస్ఐ ఇషాక్, ఏఎస్ఐ రామాంజనేయులు, సిబ్బంది రహిమాన్ మృతికి సంతాపం తెలిపారు.

సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇల్లు లేని ప్రతి పేదవారికి సొంతింటి కల నేరవేర్చడమే లక్ష్యం అని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. వచ్చే నెల 10న 15వేల ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మడకశిర పర్యటన సందర్భంగా నియోజకవర్గానికి 10వేల ఇళ్లు అవసరమని విన్నవించగా సీఎం మంజూరు చేశారన్నారు. దీనికి తోడు అదనంగా 5 వేల ఇళ్లు మంజూరయ్యాయన్నారు. తహసీల్దార్లు ఇల్లు లేని ప్రతి పేదవాడికి పట్టా ఇవ్వాలని, లేనిపక్షంలో, ప్రభుత్వ స్థలంలో పట్టాలు ఇవ్వాలని ఆదేశించారు. శ్మశాన వాటికల సమస్యను పరిష్కరించాలని, ప్రతి గ్రామంలోను ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల వారికి శ్మశాన వాటికలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీధి దీపాలు లేని చోట ఏర్పాటు చేయాలని సూచించారు.

పేదలకు వరం.. సీఎంఆర్ఎఫ్: నిరుపేదలకు సీఎం సహాయ నిధి వరంలాంటిదని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు ఆయన పంపిణీ చేశారు. 45మంది లబ్ధిదారులకు రూ.22.21 లక్షల చెక్కుల అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, డాక్టర్ క్రిష్ణమూర్తి, నాగరాజు, ఈరన్న, తిప్పేస్వామి పాల్గొన్నారు.

స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్



మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే

రొళ్ల: స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో వైద్యాధికారి డాక్టర్ సృజన ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛఆంధ్ర, స్వర్ణాంధ్ర, స్వస్థనారి స్వశక్తపరివార్ అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు స్వచ్ఛత పరిశుభ్రత దేశంలోనే ముందు ఉండాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఎంపీడీఓ నాగేశ్వర్ శాస్త్రి, తహసీల్దార్ షెక్షావలి, డాక్టర్ బాలప్రణీత్‌రెడ్డి, కులదీప్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, దాసిరెడ్డి, ఈరన్న, ఉగ్రేగౌడ్, రామక్రిష్ణ, పాండురంగప్ప, రమేష్‌గౌడ్, కాంతరాజు, ముదుపేగౌడ్, సన్నతిమ్మప్ప, నాగేంద్ర, యోగానంద, కృష్ణమూర్తి, బ్యాడిగెర మూర్తి పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని వినియోగించుకోండి

మడకశిర రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆధార్ కేంద్రం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు నాగరాజు, సింగిల్ విండో అధ్యక్షుడు కన్నా నరేష్ కోరారు. మండలంలోని ఆమిదాలగొంది గ్రామంలో శనివారం ఆధార్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆధార్ కష్టాలతో అనేక మంది బాధపడేవారన్నారు. పంచాయితీలోని అన్ని గ్రామాల ప్రజలు ఆధార్ కేంద్రాన్ని వినియోగించుకోవాలన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి రంగేగౌడ్, పంచాయతీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి,గిరి, రామచంద్రప్ప పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే ప్రభుత్వ లక్ష్యం

సోమందేపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజం ఉంటుందని టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశులు తెలిపారు. శనివారం మండలంలోని జేజేనగర్‌లో ఏర్పాటుచేసిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ నర్సింగరావు, డీడీ రెడ్డిశేఖర్, వైద్యులు ఆయిషా, ఓంకార్, కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

సోలార్ కంపెనీల మాయలో పడకండి

రొద్దం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు సోలార్ కంపెనీల పేరుతో ప్రైవేట్ వారికి భూములు అప్పగిస్తోందని వారి మాయలోపడకండని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు హరి సూచించారు. శనివారం రొద్దంలో రైతు సంఘం నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఫకృద్దీన్, రైతులు పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

సోమందేపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు పెద్దన్న పిలుపునిచ్చారు. శనివారం తుంగోడు పంచాయతీలో ప్రభుత్వం చేపడుతున్న బలవంతపు భూసేకరణను ఆపాలని 24న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో బాధిత రైతు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు సురేష్, రత్నమ్మ, రామాంజనేయులు, అంజినప్ప, బాబు, ఓబులేసు, గంగప్ప, కిష్టప్ప పాల్గొన్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల

హిందూపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దళితవాడల మౌలిక సదుపాయాల వసతి కోసం ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.2కోట్లు నిధులు మంజూరైనట్లు మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య తెలిపారు. శనివారం చైర్మన్ చాంబర్‌లో టీడీపీ కౌన్సిలర్లు, నాయకులతో సమావేశం అయ్యారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని మున్సిపాలిటీలోని దళిత కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు ఈనిధులు వినియోగించనున్నట్లు తెలిపారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, కౌన్సిలర్లు నాగేంద్రమ్మ, సతీష్‌కుమార్, సుమోశీన, శివ, జయసింహ, సుబ్బయ్య, మహేష్, ఆదెప్ప పాల్గొన్నారు.

బెంచీల ఏర్పాటు

హిందూపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎంజీఎం క్రీడామైదానంలో నిత్యం ప్రజలు వ్యాయామం, వాకింగ్ చేస్తుంటారు. వీరికోసం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో కూర్చోవడానికి సిమెంటు బెంచీలు ఏర్పాటు చేశారు. వీటిని శనివారం నుంచి వినియోగంలోకి తీసుకొచ్చినట్లు రోటరీక్లబ్ సభ్యులు పేర్కొన్నారు. ప్రెసిడెంట్ కళ్యాణ్, కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, విజయ్, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

హిందూపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు బ్యూటీషియన్, కంప్యూటర్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ ఒక ప్రకటనలో తెలిపారు. 18నుంచి 30ఏళ్ల వయసున్న యువతీ యువకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూడునెలలపాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ పూర్తయ్యాక సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9676706976 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఏసీఎల్‌పీ ద్వారానే రుణాల మంజూరు: పీడీ

రొద్దం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలకు బ్యాంకర్లు ఏసీఎల్‌పీ ద్వారానే రుణాలు మంజూరు చేయాలని ఐకేపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసయ్య ఆదేశించారు. శనివారం రొద్దంలోని ఐకేపీ కార్యాలయంలో ఏసీఎల్‌పీ-ఎల్‌సీపీపై బ్యాంకర్లు, ఐకేపీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏదైనా సమస్యలుంటే ఏపీఎం, వెలుగు సీసీలతో సమన్వయం చేసుకోవాలన్నారు. కెనరాబ్యాంక్ మేనేజర్ గంగాధర్, నాగరాజు, వినయ్, ఏపీఎం జయచంద్ర, సీసీలు పాల్గొన్నారు.

చట్టాలపై డ్రైవర్లకు అవగాహన

మడకశిర టౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు అవరణంలో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు చట్టాలపై న్యాయాధికారి ఆర్.అశోక్‌కుమార్ అవగాహన కల్పించారు. శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయాధికారి పాల్గొని మాట్లాడారు. డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్ గురించి, యూటర్న్ చేసేకోనే సమయంలో సిగ్నల్స్ వెయ్యడం వల్ల జరిగే నష్టం గురించి వివరించారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోండి

మడకశిర రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోజం చేసుకోవాలని డాక్టర్ వినోద్ కుమార్ కోరారు. గౌడనహళ్లి, జమ్మానిపల్లి గ్రామాల్లో 104 వైద్య సేవల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సూపర్‌వైజర్ రాంప్రసాద్, టీడీపీ క్లస్టర్ కన్వీనర్ మురళీబాబు, హెచ్ఎం సురేష్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం పరిశీలన

రొద్దం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నరసింహ ట్రేడర్స్‌లో నిల్వ ఉంచిన ఎరువులను పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ పరిశీలించారు. శనివారం మెయిన్‌బజార్‌లోగల ఎరువుల దుకాణాని ఆయన తనిఖీ చేశారు. ఏయే ఎరువులు అందుబాటులో ఉన్నాయి, ఎంత మొత్తంలో అమ్మారు, రికార్డులన్నీ సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. వ్యవసాయాధికారి రాజేష్, ఆర్ఐ లక్ష్మీదేవి, వీఆర్ఓ రామ్మోహన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పరిగి: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పరిగి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని పీటీసీ క్రీడా మైదానంలో శుక్రవారం నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-18 వంద మీటర్ల పరుగు పందెంలో షాహీద్ మొదటిస్థానం, మానస జావ్లింగ్ త్రోలో రెండోస్థానం పొందారు. వీరిద్దరు 25న ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైన సందర్భంగా కళాశాల యాజమాన్యం డాక్టర్ సురేష్, ప్రిన్సిపాల్ బైరిశెట్టి, పీడీ కార్తీక్ విద్యార్థులను అభినందించారు. బాబాఖాన్, వెంకట్‌నందన్, అశ్విని, శంకర్ పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని కోరెవాండ్లపల్లి ఉన్నతపాఠశాలకు చెందిన వనజ, బిందుశ్రీ, హర్షిత్‌కుమార్ రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సుధాకర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ వారధి ఫౌండేషన్ సంయుక్తంగా ప్రతియేటా నిర్వహించే జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో వారు పాల్గొన్నారు. గైడ్ టీచర్ తనూజ్‌కుమార్, భాస్కర్, త్రివిక్రమరావు ఉన్నారు.

అగళి: రాష్ట్రస్థాయి వక్తృత్వపు పోటీలకు స్థానిక జడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మస్తాన్ తెలిపారు. ఇటీవల సత్యసాయి జిల్లాలో జరిగిన వక్తృత్వపు పోటీలలో అర్షియాబాను, దీక్షిత, సంజీవ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్ తెలిపారు. విద్యార్థులను గైడ్ టీచర్స్ షబ్బీర్, భాస్కర్‌లను డీఈఓ క్రిష్టప్ప అభినందించారు.

మొక్కలను నాటి పరిరక్షించాలి

ఓఎస్‌డీ సుమన జయంతి



మొక్క నాటుతున్న ఓఎస్‌డీ సుమన జయంతి

రొద్దం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజలు మొక్కలను నాటి పరిరక్షించాలని మంత్రి సవిత ఓఎస్‌డీ సుమన జయంతి పిలుపునిచ్చారు. పట్టణంలోని మూడో సచివాలయం పక్కన మొక్కలను నాటే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతను పాటించి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం ఓఎస్‌డీ, మంత్రి వ్యక్తిగత సహాయకులు శ్రీనివాసులు మొక్కలను నాటారు. డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, టీడీపీ నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, నరహరి, ఆంజనేయులు, అశ్వత్థనారాయణ, ఎంపీడీఓ రామ్‌కుమార్, ఈఓఆర్డీ గోవిందప్ప, ఏపీఎం జయచంద్ర పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని రైల్వే స్టేషన్‌వద్ద స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్, రెడ్డివారి మంజునాథ్, కన్వీనర్ శ్రీరాములు, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, షౌకత్, రఘు, బీజేపీ రామక్రిష్ణ పాల్గొన్నారు.



పెనుకొండలో మొక్క నాటి నీరు పోస్తున్న ఆర్డీఓ, నాయకులు

హిందూపురం: సమాజం బాగుపడాలంటే స్వచ్ఛత ఎంతో అవసరమని మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చిన్నగుడ్డంపల్లివద్ద ఉన్న కంపోస్టుయార్డ్‌లో 2వేల మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, కౌన్సిలర్లు నాగేంద్రమ్మ, సతీష్, నవీన్, హరీష్, అధికారులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరుపోస్తున్న మున్సిపల్ చైర్మన్ రమేష్, అధికారులు, నాయకులు



ఆర్డీటీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బహుజన చైతన్యవేదిక నాయకులు

ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణకు అసెంబ్లీలో తీర్మానించాలి

పెనుకొండ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్న ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని బహుజన చైతన్యవేదిక అధ్యక్షుడు శివరాం క్రిష్ణ డిమాండ్ చేశారు. శనివారం బహుజన చైతన్యవేదిక ఆధ్వర్యంలో సేవ్‌ఆర్డీటీ కార్యక్రమంలో భాగంగా నిరసన చేపట్టారు. ఉదయం ఆర్డీటీ అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని నినాదాలుచేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో బడుగు బలహీనవర్గాల ఉన్నతి కోసం ఆర్డీటీ ఎనలేని సేవలు అందిస్తోందన్నారు. విదేశీ నిధులు రావడానికి వీలుగా ఉన్న ఎఫ్‌సీఆర్ఏను కేంద్ర ప్రభుత్వం రెన్యువల్ చేయకుండా నిలిపివేయడంతో నిధులు రాక అభివృద్ధి పనులు కుంటు పడుతున్నాయన్నారు. పేదలను దృష్టిలో ఉంచుకుని ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపి ఒత్తిడి తేవాలన్నారు. నాయకులు రవికుమార్, బాబుప్రసాద్, రామాంజినప్ప, ఆంధ్రూస్, క్రిష్టపర్, కుల్లాయప్ప, నాగరాజు, నాగార్జున, ఎమ్మార్పీఎస్ రామాంజనేయులు, మూర్తి, ఈశ్వర్, హనుమంతు, అయూబ్, సద్దాం, శేషాద్రి, నరసింహులు పాల్గొన్నారు.

తన భూమి అనుకుని.. వరిపైర్లు నాటే యత్నం

● అడ్డుకున్న గ్రామస్థులు



రోడ్డు స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఓ రైతు తన భూమి అనుకొని పొరపాటున రెండు గ్రామాలకు వెళ్లే రోడ్డుపై వరిపైర్లు వేసేందుకు సిద్ధమైన ఘటన చిన్నపరెడ్డిపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. రైతు తిప్పన్న గ్రామస్థుల మధ్య వాగ్వాదం జరగడంతో రెవెన్యూ అధికారులు స్పందించి సర్వేచేయడంతో సమస్య పరిష్కారమైంది. గ్రామానికి చెందిన బోయ తిప్పన్న 679సర్వే నంబరులో 40సెంట్ల భూమి ఉంది. అమ్మవారిపల్లి జాతీయరహదారి నుంచి కియ అనుబంధ వేర్‌హౌస్ పక్కన చిన్నపరెడ్డిపల్లి, మోటువారిపల్లికి వెళ్లే 15 అడుగుల రోడ్డు ఉంది. వేర్‌హౌస్‌ల వద్ద గ్రామానికి వెళ్తున్న రోడ్డుపై తిప్పన్న వరిపైర్లు వేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డుపై వరిపైర్లు ఎలా వేస్తావని తిప్పన్నను గ్రామస్థులు నిలదీశారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా తహసీల్దార్ స్వాతి పోలీస్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. రెండ్రోజుల్లో భూమి సర్వేచేసి హద్దులు కనబరుస్తామని తహసీల్దార్ తెలుపడంతో సమస్య సద్దుమణిగింది.

శ్రమదానంతో చెరువు కాలువకు మరమ్మతులు



కాలువకు మరమ్మతులు చేస్తున్న ప్రజలు

చిలమత్తూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురుచూడకుండా ఆ గ్రామ ప్రజలే ముందుకు వచ్చి శ్రమదానంతో చెరువుకు నీరు వచ్చే సప్లై చానల్‌కు మరమ్మతులు చేసుకుంటున్నారు. శెట్టిపల్లి చెరువుకు కుషావతి నది నుంచి కోడూరు వద్ద సప్లై చానల్ ద్వారా నీరు వెళుతుంది. కాలువలో పిచ్చి మొక్కలు, కంప చెట్లు, గట్లు తెగిపోవడంతో చెరువులోకి నీరు వెళ్లడం లేదు. అధికారులపై ఆధారపడకుండా చెరువు ఆయకట్టు సంఘం ఆధ్వర్యంలో రైతులు స్వచ్ఛందంగాశనివారం శ్రమదానంతో మరమ్మతులు చేశారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెనుకొండ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బుక్కపట్నంలో డ్వాక్రా మహిళల సొమ్మును కాజేసిన వారి గురించి ఆరాతీయడానికి వెళ్లిన సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్‌పై వెలుగు కార్యాలయంలో సిబ్బంది దాడిచేయడం అమానుషమని సివిల్ సప్లై యూనియన్ నాయకులు అన్నారు. దాడి చేసినవారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. శనివారం సివిల్ సప్లైస్ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, గంగాధర్, సుధాకర్, నాగేంద్రబాబు, భక్తర్‌వలి, నరసింహులు, తిప్పన్న ఓబులేసు, రాజు డీటీ ప్రభావతికి వినతిపత్రం అందించారు.

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): బుక్కపట్నంలో సంతోష్ గ్రామైఖ్య మహిళా సంఘంలో జరిగిన అవినీతిని ప్రశ్నించిన సభ్యులపై దాడిచేసినవారిని కఠినంగా శిక్షించాలని కార్మిక సంఘం నాయకులు గోరంట్ల తహసీల్దార్ మారుతికి శనివారం వినతిపత్రం అందించారు. మహిళా సంఘం మాజీ లీడర్, సీసీ, బుక్‌కీపర్లు రూ.8లక్షలు స్వాహా చేసినసంఘటనపై సభ్యులు సీపీఎం సహకారంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. సభ్యులపై దాడిచేయడం అమానుషమని, వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ప్రశంసాపత్రం అందజేస్తున్న అధికారులు

పావగడ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన వరస ప్రశ్న కార్యక్రమంలో జైగురుదేవ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కోశాధికారి పరంధామరెడ్డి తెలిపారు. బాల భవన కమిటీ, శిశు సంక్షేమ శాఖ, జిల్లా పంచాయతీ, విద్యాశాఖ ఆధ్వర్యంలో దసరా పండగ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు విజయం సాధించారు. విద్యార్థులు విద్యతోపాటు పోటీ తత్వాన్ని పెంచుకుని అన్నిరంగాల్లో రాణించాలని సీడీపీఓ సునీత అన్నారు. మొదటి రెండు, మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులు నరేంద్ర, మోక్షజ్ఞ, నిఖిల్, నవీన్‌చంద్రన్, రిషికాలను ఉపాధ్యాయులు శ్రీనివాస్, రామక్రిష్ణ, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, నటరాజ్, వెంకటలక్ష్మి అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



అశోక్‌ను సన్మానిస్తున్న హెచ్ఎం, టీడీపీ నాయకులు

గోరంట్ల, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న పాలసముద్రం పాఠశాల హెచ్ఎం అశోక్‌ను కాంప్లెక్సు సమావేశం అనంతరం శనివారం సన్మానించారు. అశోక్ ఇటీవల జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. నాయకులు బెల్లాలచెరువు చంద్ర, మనోహర్, జయచంద్రారెడ్డి, మూర్తి, గంగాధర్, హరీష్‌రెడ్డి, ఇర్షాద్, సుధాకర్ పాల్గొన్నారు.